Bhavani Publication Trust
https://prajatheerpudaily.com

# ప్రజాతీర్పు
The people's Verdict
తెలుగు జాతీయ దినపత్రిక

కావలెను
ప్రజాతీర్పు
The people's Verdict
తెలుగు జాతీయ దినపత్రిక
The Largest Circulated Telugu Fortnightly
సామాజిక, రాజకీయాలపై అవగాహన ఉన్న ఉత్సహావంతులైన యువకులు జర్నలిస్టులుగా ఎదిగే గొప్ప సదావకాశం..
కేంద్ర, రాష్ట ప్రభుత్వాల గుర్తింపు పొందిన ప్రజాతీర్పు దినపత్రికలో తెలంగాణలోని అన్ని జిల్లాల్లో పని చేయడానికి స్టాఫ్ రిపోర్టర్లు, కంట్రిబ్యూటర్లు, అడ్వర్టయిజ్‌మెంట్ మేనేజర్లు, సర్క్యులేషన్ ఇన్‌చార్జిలు కావలెను
వెంటనే కావలెను
• బ్యూరో ఇన్‌చార్జిలు • స్టాఫ్ రిపోర్టర్లు
ఆర్‌సి ఇన్‌చార్జిలు • మండల రిపోర్టర్లు
అనుభవం ఉన్న వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును
ఆసక్తి ఉన్న వారు మీ పూర్తి బయోడేటా ఈ వాట్సాప్ నంబర్‌కు పంపగలరు
8309979541, 9885353018, 9494659622

సంపుటి : 26 | సంచిక : 267 | హైదరాబాద్ | మంగళవారం 11 ఆగస్టు 2026 | పేజీలు : 8 | వెల : రూ. 1/-
Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOOR



## ఉద్యమం.. ఉద్రిక్తం

**బారికేడ్లను దాటుకుని కదం తొక్కిన వైనం**

**బాష్పవాయు, జలఫిరంగులను ప్రయోగించిన పోలీసులు**

**లాఠీచార్జ్‌లో గాయపడిన పరీక్షార్థులు**

**నలుగురు పోలీసులకూ గాయాలు**

రాంచీ: దేశ రాజధానిలో నీట్ లీకేజీ ఉదంతంపై విద్యార్థుల సారథ్యంలో కొనసాగిన ఉద్యమం చివరకు పోలీసుల లాఠీచార్జ్‌తో ఉద్రిక్తంగా ముగియగా అదే బాష్పవాయుగోళాల ప్రయోగాలు, రక్తసిక్తమైన విద్యార్థులు, ప్రభుత్వ వ్యతిరేక నినాదాల దృశ్యాలు సోమవారం జార్ఖండ్ రాజధానిలో పునరావృతమయ్యాయి. జార్ఖండ్ పబ్లిక్ సర?వస్ కమిషన్(జేపీఎస్సీ),

- మిగతా 2వ పేజీలో




## సభకు అమిత్ షా వస్తారు!

**విద్యార్థులపై బలప్రయోగంపై సమాధానమిస్తారు..**

**లోక్‌సభ వేదికగా కేంద్ర పార్లమెంటరీ మంత్రి రిజిజు**

**విపక్షాల ఆందోళనతో దిగివచ్చిన కేంద్ర ప్రభుత్వం**

న్యూఢిల్లీ, ఆగస్టు 10: నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ, అక్రమాలను నిరసిస్తూ, కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను డిమాండ్ చేస్తూ ఢిల్లీలో గతనెల 20న విద్యార్థులు, కాక్రోచెస్ జనతా పార్టీ (సీజేపీ) నేతలు శాంతియుతంగా చేపట్టిన 'చల్ పార్లమెంట్' ర్యాలీపై పోలీసులు జరిపిన లాఠీచార్జిపై కేంద్ర మంత్రి హోంమత్రి అమిత్ షా సమాధానం ఇవ్వాలని విపక్షాలు చేస్తున్న డిమాండ్‌కు ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం దిగివచ్చింది. లాఠీచార్జిపై అమిత్ షా పార్లమెంట్ వేదికగా సమాధానం ఇస్తారని సోమవారం ఈ మేరకు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజుజు స్పష్టం చేశారు. విపక్ష సభ్యులు అడిగిన ప్రతిప్రశ్నకు అమిత్ షా సమాధానం ఇస్తారని స్పష్టం చేశారు. హోం మంత్రి సమాధానం ఇచ్చే సమయంలో ప్రతిపక్షాలు ఎలాంటి హంగామా చేయకూడదని విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్ సమావేశాలు మొదలైన నాటి నుంచి అమిత్‌షాను సభకు

- మిగతా 2వ పేజీలో





# అదిరిందయ్యా.. ఆది

## వంద తరాలు నిలిచేలా ఆలయ అభివృద్ధి

**వందల కోట్లతో ఎములాడకు కొత్త రూపు.. ప్రభుత్వ విప్ ఆధ్వర్యంలో చురుకుగా పనులు**

**ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే.. ఇప్పటికే సగం పనులు పూర్తి**

(ప్రజాతీర్పు ప్రతినిధి, వేములవాడ)

గతంలో ఏ ఎమ్మెల్యేకు సాధ్యం కాని పని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సుసాధ్యం చేస్తున్నారు. ఏళ్లుగా వేములవాడ ఆలయ అభివృద్ధి కేవలం కాగితాలకు, నేతల ప్రకటనలకు పరిమితం కాగా, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తన హయాంలో దానికి కార్యచరణలోకి తీసుకువచ్చారు. తెలంగాణ ప్రభుత్వంతో పాటు ముఖ్యంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అంతే ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం త్వరలో సరికొత్త ఆధ్యాత్మిక శోభను సంతరించుకోబోతోంది. భక్తజన సందోహంతో నిత్యం రద్దీగా ఉండే ఈ పుణ్యక్షేత్రంలో విస్తరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ ఆలయ అభివృద్ధి పనుల పురోగతిని రాష్ట్ర ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, జిల్లా మంత్రుల సహకారంతో ఆలయానికి కొత్త రూపు ఇచ్చేందుకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తన వంతు కర్తవ్యాన్ని నిర్వర్తిస్తున్నారు. శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయానికి కొత్త రూపు ఇవ్వడం అనే మహాక్రతువులో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ భాగస్వామ్యం అవుతున్నారు. రాజన్న భక్తులతోపాటు, పరిసర ప్రాంతాల ప్రజలు, పట్టణ ప్రజల చిరకాలవాంఛ. రాజన్న ఆలయాభివృద్ధి నా హయాంలో జరగడం పూర్వజన్మ సుకృతంగా ఆయన భావిస్తున్నారు. శృంగేరి పీఠాధిపతుల సలహాలు, సూచనలు, స్థానిక ప్రజల సలహాలు సూచనలు పరిగణలోకి తీసుకుని

- మిగతా 2వ పేజీలో



## ఎంజీబీఎస్–చాంద్రాయణగుట్ట మెట్రోకు గ్రీన్‌సిగ్నల్

**భూసేకరణపై మధ్యంతర స్టే ఎత్తివేసిన హైకోర్టు..**

**చట్ట ప్రకారం ముందుకెళ్లాలని సర్కార్‌కు ఆదేశం**

హైదరాబాద్: మహాత్మాగాంధీ బస్‌స్టేషన్ నుంచి చాంద్రాయణగుట్ట మధ్య ప్రతిపాదిత హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్--2, కారిడార్-6 పనులకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. భూసేకరణకు సంబంధించి గతంలో విధించిన మధ్యంతర స్టేను ఎత్తివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే భూసేకరణ ప్రక్రియ చట్టబద్ధంగా, సంబంధిత నిబంధనలను పాటిస్తూ కొనసాగించాలని స్పష్టం చేసింది. మెట్రో ప్రాజెక్టు పనులు నిలిచిపోతే నగరంలోని సమగ్ర ప్రజా రవాణా వ్యవస్థపై ప్రభావం పడుతుందని చెప్పింది. ఇతర అంశాలన్నీ తామిచ్చే తుది తీర్పునకు లోబడి ఉంటాయని చెబుతూ విచారణ వాయిదా వేసింది. భూసేకరణ ప్రక్రియలో తమ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా జారీ చేసిన

- మిగతా 2వ పేజీలో

# వర్షాలు కురవాలి.. ప్రాజెక్టులు నిండాలి

## మహా వరుణ యాగంలో సీఎం రేవంత్‌రెడ్డి

**కృష్ణమ్మకు పూర్ణాహుతి సమర్పణ**

**రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు పడాలని ప్రార్థన**

**నాగార్జునసాగర్‌లోని కృష్ణా తీరాన శాస్త్రోక్తంగా వైదిక క్రతువులు**

**108 మంది రుత్వికులు.. 11 హోమ గుండాలు**



**నల్లగొండ:** రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ ప్రభుత్వం నిర్వహించిన మహా వరుణయాగం వేదపండితుల మంత్రోచ్చారణలు, వైదిక క్రతువుల మధ్య శాస్త్రోక్తంగా, భక్తిశ్రద్ధలతో సంపూర్ణమైంది. నాగార్జునసాగర్‌లోని విజయవిహార్ అతిథి గృహం వద్ద కృష్ణా నది ఒడ్డున నిర్వహించిన ఈ యాగంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దంపతులు పాల్గొని రుత్వికుల మార్గదర్శకత్వంలో క్రతువులు

- మిగతా 2వ పేజీలో

## పీఎం ఏక్తా మాల్ టెండర్లలో

# భారీ కుంభకోణం

**టెండర్లు రద్దు చేసి, స్వతంత్ర విచారణ జరిపించాలని కేంద్రానికి కేటీఆర్ డిమాండ్**

**ప్రజా భూమి, కేంద్ర నిధులు.. కానీ ప్రైవేటు డెవలపర్‌కు దోచి పెడుతున్న రేవంత్ రెడ్డి**

**కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్ కి లేఖ రాసిన కేటీఆర్**

**హైదరాబాద్‌లోని రాయదుర్గ్‌లో ప్రతిపాదించిన పీఎం ఏక్తా (యూనిటీ) మాల్ టెండర్లలో తీవ్రమైన ఆర్థిక అక్రమాలు, భారీ కుంభకోణం జరిగిందని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. యూనిటీ మాల్ టెండర్లలో కావాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం అక్రమమైన, అనుమానాస్పద నిబంధనలు పెట్టి, ప్రజా వనరులను తాకట్టు పెట్టి ప్రైవేటు డెవలపర్‌కు విపరీతమైన లబ్ధి చేకూరుస్తున్నారని ఆరోపిస్తూ, ఆ టెండర్‌ను తక్షణమే రద్దు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్‌కు కేటీఆర్ ఒక లేఖ రాశారు.**



(ప్రజాతీర్పు ప్రతినిధి, రంగారెడ్డి జిల్లా)

ప్రాజెక్టుపై ఎటువంటి తుది నిర్ణయాలు తీసుకోకముందే, ప్రవేట్ సంస్థల జేబుల్లోకి వెళ్లే కేంద్ర నిధుల విడుదలను తక్షణమే నిలిపివేయాలని, మొత్తం వ్యవహారంపై స్వతంత్ర దర్యాప్తునకు ఆదేశించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. భూమి విలువ కాకుండాడ, ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం దాదాపు 2,059.81 కోట్లు అని, దీనిలో భారీ అక్రమాలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పాల్పడుతుందని కేటీఆర్ తన లేఖలో వివరించారు. ఈ ప్రాజెక్టు కోసం దీని కోసం సుమారు 202 కోట్ల కేంద్ర సహాయం మంజూరైందని కేటీఆర్ గుర్తుచేశారు. రాయదుర్గ్‌లోని అత్యంత విలువెన 6.30 ఎకరాల స్థలంలో, సుమారు 27 లక్షల చదరపు అడుగుల నిర్మిత ప్రాంతంతో ఈ ప్రాజెక్టును తలపెట్టారని తెలిపారు. ఈ టెండర్‌లో

- మిగతా 2వ పేజీలో



## ఆగస్టు 15 తర్వాత.. ఉద్యమ కార్యాచరణ తీవ్రం

- పార్టీనేతల మధ్య సయోధ్య.. సర్జరీ పూర్తయింది, లంచ్‌లు, డిన్నర్‌లు కూడా జరిగాయి
- సినిమా పిచ్చి ఉన్నవారు కొంతమంది జనసేనలోకి
- మీడియా చిట్‌చాట్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

హైదరాబాద్: ఆగస్టు 15 తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వ వైఫుల్యాలు, తప్పులు, హామీల అమల్లో వెనుకడుగు, ఫీజు బకాయిలు తదితరాలపై ఉద్యమ కార్యాచరణ తీవ్రం చేయనున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

- మిగతా 2వ పేజీలో



## కేసీఆర్ వస్తారు.. మెడికల్ కాలేజీకి 'పెద్ది' పేరు పెడతారు

వరంగల్/నర్సంపేట: తెలంగాణ ఉద్యమ బిడ్డ పెద్ది సుదర్శన్‌రెడ్డికి ఉద్యమ గడ్డ ఘనమైన గౌరవం ఇచ్చిందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రాబోయే రెండేళ్లలో కేసీఆర్ నాయకత్వంలో బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తుందని, పెద్ది ఆశయాల మేరకు నర్సంపేటను అభివృద్ధి చేస్తామన్నారు. నర్సంపేట మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్‌రెడ్డి పేరు పెడతామంటూ భావోద్వేగానికి లోనయ్యారు. నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది దశదిన కర్మ సందర్భంగా వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలో సోమవారం నిర్వహించిన సంస్మరణ సభలో మాజీ మంత్రి హరీశ్‌రావుతో కలిసి

- మిగతా 2వ పేజీలో

# అదిరిందయ్యా.. ఆది

(మొదటి పేజీ తరువాయి)

ఆగమశాస్త్రానికి అనుగుణంగా తరాలు గుర్తిండిపోయేలా రాజన్నఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నారు. రాజన్న ఆలయ అభివృద్ధి పనులు 100 తరాల మాస్టర్ ప్లాన్‌తో చేపడుతున్నారు. ఇందుకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయిస్తున్నారు. ఇప్పటికే మంజూరైన రూ.150 కోట్లకు అదనంగా ప్రభుత్వం ఇటీవల రూ.99.40 కోట్లను విడుదల చేసింది. మొత్తంగా రాజన్న ఆలయానికి ఇప్పటివరకు రూ.249.40 కోట్ల నిధులతో పనులు చేపడుతున్నారు. ప్రస్తుతం ఆలయ అభివృద్ధి పనుల్లో సుమారు 55 శాతం మేర నిర్మాణాలు పూర్తయ్యాయి. పనుల్లో అత్యంత కీలకమైన తూర్పు గోపురాన్ని సుమారు 95 అడుగుల ఎత్తులో అత్యంత సుందరంగా నిర్మిస్తున్నారు. ఈ మహాద్భుత నిర్మాణానికి అవసరమైన పవిత్ర కృష్ణశిలలను అధికారులు ప్రణాళికాబద్ధంగా దశలవారీగా సమీకరిస్తున్నారు. మిగిలిన శిలలను కూడా వీలైనంత త్వరగా తెప్పించి, గోపురంతో పాటు అన్విటి మండపం పనులను వేగవంతం చేస్తున్నారు. రాజన్న ఆలయ పనులు జరుగుతున్న నేపథ్యంలో భక్తుల దర్శనానికి ఆటంకం కలగకుండా ప్రత్యామ్నాయంగా భీమేశ్వర ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

### పట్టణ అభివృద్ధికి..

రాజన్న ఆలయంతో పాటు పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వేములవాడ పట్టణ అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నారు. టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించే పనుల్లో భాగంగా మూలవాగు బ్రిడ్జి నుంచి రాజన్న ఆలయం వరకు రూ.47 కోట్లతో 80ఫీట్ల రోడ్డు విస్తరణ పనుల వేగంగా జరుగుతున్నాయి. డ్రైనేజీ, విద్యుత్ స్తంభాలు, రోడ్డుపై కంకరతో 50శాతం పనులు పూర్తి అయ్యాయి. రూ.35కోట్లతో రాజన్న ఆలయ సమీపంలో అన్నదాన సత్రం పనులు, రూ.76కోట్లతో ఆలయ విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయి.

# ఎంజీబీఎస్– చాంద్రాయణగుట్ట మెట్రోకు గ్రీన్‌సిగ్నల్

(మొదటి పేజీ తరువాయి)

ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ హైదరాబాద్ మీరాలం మండికి చెందిన మహమ్మద్ అబ్దుల్ రవూఫ్‌తోపాటు మరికొందరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయమూర్తి.. పిటిషనర్ల ఆస్తులకు సంబంధించి అవార్డు జారీ చేయకుండా గత అక్టోబర్‌లో మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. వీటిని రద్దు చేయాలని కోరుతూ ఇటీవల ప్రభుత్వం మధ్యంతర అప్లికేషన్ (ఐఏ) దాఖలు చేసింది. ఈ ఐఏపై జస్టిస్ ఎన్‌వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది.

### చట్టవిరుద్ధంగా సాగితేనే జోక్యం

ప్రభుత్వం తరఫున ఏఏజీ ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపిస్తూ.. ప్రస్తుత రహదారి వెడల్పు 60 అడుగులు కాగా, హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్ ప్రకారం దానిని 100 అడుగులకు విస్తరించేందుకు భూసేకరణ చేపట్టినట్లు తెలిపారు. మెట్రో మార్గం కోసం హెచ్ఏఎంఎల్ డ్రోన్, లైడార్ సర్వే సాంకేతికతలను ఉపయోగించి ఆస్తులను సర్వే చేశామన్నారు. రహదారిపై నిర్మాణాలు ఒకేలైన్‌లో లేకపోవడంతో ఇరువైపులా భూసేకరణ విస్తీర్ణం సమానంగా ఉండటం సాధ్యం కాదన్నారు. పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. భూసేకరణ ప్రాంతంలో మార్కెట్ విలువ చదరపు గజానికి రూ.3 నుంచి 4 లక్షల వరకు ఉండగా, అధికారులు రూ.30,989గా నిర్ణయించినట్లు తెలిపారు. చర్చల అనంతరం అంగీకార అవార్డు కింద భూమి విలువకు చదరపు గజానికి రూ.81,000 చెల్లించడంతోపాటు పునరావాస, పునఃనిర్మాణ (ఆర్‌అండ్‌ఆర్) ప్రయోజనాలు అందిస్తున్నట్లు ఏఏజీ పేర్కొన్నారు. నిర్వాసిత కుటుంబానికి రూ.12.04 లక్షలు, వ్యాపారం లేదా అద్దె ఆదాయం కోల్పోయే ప్రభావిత కుటుంబానికి రూ.6 లక్షల ఆర్‌అండ్‌ఆర్ నగదు ప్రయోజనం అందిస్తున్నట్లు వివరించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. సమగ్ర సర్వే, సాంకేతిక నిపుణుల పరిశీలన అనంతరం అధికారులు అలైన్‌మెంట్‌ను నిర్ణయించాల్సి ఉంటుందని చెప్పారు. అలైన్‌మెంట్ నిర్ణయం ఏకపక్షంగా, దురుద్దేశపూర్వకంగా లేదా చట్ట, రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధంగా ఉంటేనే తాము జోక్యం చేసుకునే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు.

# మెడికల్ కాలేజీకి 'పెద్ది' పేరు పెడతారు

(మొదటి పేజీ తరువాయి)

ఆయన నివాళులర్పించారు. పెద్ది అంతిమయాత్రకు కుండపోత వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఓరుగల్లు మొత్తం కదిలివచ్చిందని, 12 గంటలపాటు లక్షలాది మంది తరలిరావడం ప్రజల గుండెల్లో ఆయన సంపాదించుకున్న స్థానానికి నిదర్శనమని కేటీఆర్ అన్నారు. పెద్ద పెద్ద పదవులు చేపట్టకపోయినా తెలంగాణ ఉద్యమంతోపాటు ఉమ్మడి వరంగల్ జిల్లా పోరాటాలకు నాయకత్వం వహించిన మహోన్నత ప్రజానాయకుడని కొనియాడారు. చివరి రోజుల్లోనూ దేవాదుల నీటి కోసం, విద్యార్థుల సమస్యలపై పోరాటాలు చేసేందుకు పెద్ది తపించారని గుర్తుచేసుకున్నారు. కరోనా, ఆర్థిక సంక్షోభ సమయంలోనూ నర్సంపేటలో ఇంటింటికీ పైపులైన్ గ్యాస్ అందించారని, రైతుల కోసం రూ.100 కోట్ల ప్రత్యేక ప్రాజెక్టును సాధించారని తెలిపారు. పెద్ది భార్య స్వప్న, వారి పిల్లలు, కుటుంబసభ్యులకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు.

### పెద్ది లేని నర్సంపేటను ఊహించలేకున్నా: హరీశ్

పెద్ది లేని నర్సంపేటను ఊహించలేకపోతున్నానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. 'ఉద్యమ సమయంలో పోలీసులతో జరిగిన తోపులాటలో డీసీఎం పైనుంచి కిందుపడిపోయిన నన్ను.. పెద్ది సుదర్శన్ రెడ్డి ఆస్పత్రిలో చేర్పించి ప్రాణాలు కాపాడారు. అదే ఆస్పత్రిలో ఆయనను నేను చివరిచూపు చూడాల్సి వస్తుందని కలలో కూడా ఊహించలేదు' అంటూ హరీశ్ కన్నీటిపర్యంతమయ్యారు. తెలంగాణ కోసం ప్రాణాలు, ఆస్తులు, పదవులు లెక్కచేయకుండా పెద్ది పోరాడారన్నారు. మానుకోట, పరకాల, స్టేషన్‌ఘన్‌పూర్ ఉపఎన్నికల్లో ఆయన పోరాట స్ఫూర్తి మరువలేనిదన్నారు. నర్సంపేటకు మెడికల్ కాలేజీ, రామప్ప, పాకాల, లక్నవరం చెరువులకు దేవాదుల నీళ్లు సాధించడంలో ఆయన కృషి ఎనలేనిదని కొనియాడారు. ఈ సభలో పార్టీ ముఖ్యనేతులతోపాటు పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహ ప్రతిష్ఠ తీవ్ర ఉద్రిక్తత నడుమ జరిగింది. స్థానిక మెడికల్ కాలేజీ సమీపంలో విగ్రహం పెట్టాలని నిర్ణయించగా సంబంధిత నిర్మాణాన్ని ఆదివారం రాత్రి మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. దీంతో సోమవారం ఉదయం పలువురు నాయకులు ఆందోళనకు దిగారు. కూల్చిన ప్రదేశంలోనే మళ్లీ గద్దె నిర్మించగా మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. దీంతో పోలీసులు, బీఆర్ఎస్ మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.

# ఉద్యమ కార్యాచరణ తీవ్రం

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక నిర్ణయాలు, విధానాలపై త్వరలోనే పాదయాత్ర, బస్సుయాత్ర ఇతర రూపాల్లో చేపట్టబోయే పోరుబాటపై నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈనెల 15 తర్వాత 'క్యూర్'పై నిపుణులు, వివిధ వర్గాల ప్రజల నుంచి ప్రజాభిప్రాయ సేకరణ జరిపేందుకు వర్క్‌షాప్ నిర్వహిస్తామని చెప్పారు. క్యూర్‌లో పన్నుల విధానం, కార్పొరేటర్ల పాత్ర, పట్టణ ప్రణాళిక, నీరు--మురుగునీటి వ్యవస్థలను వేరు చేయడం వల్ల ఎదురయ్యే సమస్యలు, పన్నుల భారం వంటి ముఖ్యమైన విషయాలపై స్పష్టత కొరవడిందన్నారు. సోమవారం బీజేపీ కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో రాంచందర్‌రావు ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. రేవంత్ సర్కార్ తీసుకొచ్చిన 'హిట్లుర్, హిల్ట్, హైడ్రా'(త్రీ హెచ్)తో రాష్ట్రంలో అభివృద్ధి స్తంభించిపోయిందన్నారు. హైడ్రా సెలక్టివ్‌గా అక్రమ కట్టడాలను ధ్వంసం చేస్తోందని, ఎంఐఎంకు సంబంధించిన వాటి విషయంలో చర్యలేవీ తీసుకోవడం లేదని ఆరోపించారు. 'రేవంత్ వరుణయాగం చేస్తే.. మేము వారు కొట్టుకుపోవాలని వాయుయాగం చేస్తాం'అని నవ్వుతూ ఓ ప్రశ్నకు బదులిచ్చారు.

# వర్షాలు కురవాలి.. ప్రాజెక్టులు నిండాలి

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించారు. కృష్ణమ్మకు సీఎం పూర్ణాహుతి సమర్పించారు. 'రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురవాలి. కృష్ణా, గోదావరి నదులు నిండుగా ప్రవహించాలి. ప్రాజెక్టులు, చెరువులు నిండాలి..'అని ప్రార్థించారు.

### బ్రహ్మ ముహూర్తంలో..

సోమవారం ఉదయం 4 గంటలకు బ్రహ్మ ముహూర్తంలో యాగాన్ని ప్రారంభించారు. ప్రారంభ క్రతువులో నీటిపారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఆయన సతీమణి కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి పాల్గొన్నారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయ అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో 108 మంది రుత్వికులతో 11 హోమ గుండాలతో వరుణ దేవుని అనుగ్రహాన్ని ఆకాంక్షిస్తూ వైదిక విధానంలో హోమ క్రతువులు నిర్వహించారు. మధ్యాహ్నం 3.15 గంటలకు యాగశాలలోకి వచ్చిన సీఎం దంపతులు..3:24 గంటలకు పూర్ణాహుతి సమర్పించారు. 'కృష్ణా, గోదావరి పరీవాహక ప్రాంతాల్లో వర్షాలు సమృద్ధిగా పడాలి. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులతో పాటు అన్ని ప్రాజెక్టులు నిండాలి. రాష్ట్రంలోని ప్రతి చెరువు, ప్రతి కుంట జలకళను సంతరించుకోవాలి. భూగర్భ జలాలు పెరగాలి. పంటలు పుష్కలంగా పండాలి. రైతుల ముఖాల్లో చిరునవ్వులు కనిపించాలి. రాష్ట్రం సస్యశ్యామలంగా, సుభిక్షంగా ఉండాలి. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలి..'అని ముఖ్యమంత్రి వరుణ దేవుడిని ప్రార్థించారు. భారతీయ సంస్కృతిలో వర్షాలు కురవాలని యాగాలు, యజ్ఞాలు, పూజలు నిర్వహించడం పూర్వీకుల నుంచి వస్తున్న ఆధ్యాత్మిక సంప్రదాయం. కాగా వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఎల్‌నినో కారణంగా రాష్ట్రంలో ఈసారి వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉండటంతో ప్రభుత్వం ఈ మహా వరుణయాగాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, పి.సుదర్శన్‌రెడ్డి, మాజీ మంత్రి కె.జానారెడ్డి, ఎమ్మెల్యేలు కుందూరు జయవీర్‌రెడ్డి, నేనావత్ బాలునాయక్, వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డి, బీర్ల ఐలయ్య, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మందుల సామేలు, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

### కృష్ణమ్మ ఒడ్డున మార్మోగిన వేదఘోష

సూర్యకిరణాలు ఇంకా కృష్ణమ్మ జలాలను తాకకముందే.. నాగార్జునసాగర్ పరిసరాల్లో నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ సోమవారం తెల్లవారుజాము నుంచే వేద మంత్రాలు మార్మోగాయి. చతుర్వేద పారాయణంతో యాగ క్రతువు ప్రారంభమైంది. ప్రధాన యాగ క్రతువుల కోసం 32 మంది రుత్వికులు యాగశాలలో నిర్దేశించిన స్థానాల్లో ఆశీనులు కాగా, మిగిలిన రుత్వికులు నిరంతర వేద పారాయణం, జపంలో పాల్గొన్నారు. చతుర్వేద పారాయణం అనంతరం అగ్ని ప్రతిష్ఠాపన నిర్వహించారు. హోమకుండాల్లో పవిత్ర అగ్నిని ప్రజ్వలింపజేసి, వరుణ దేవుడిని ఆవాహన చేస్తూ హోమాలు నిర్వహించారు. ఆకాశం--జలం--భూమి--మానవాళి మధ్య సమతుల్యత నెలకొనాలని ఆకాంక్షిస్తూ వేద మంత్రాల నడుమ హోమ ద్రవ్యాలను అగ్నికి సమర్పించారు. ఒకవైపు కృష్ణమ్మ విశాల జలరాశి, మరోవైపు హోమకుండాల్లో ఎగసిపడుతున్న అగ్నిజ్వాలలు, వాటి మధ్య ప్రతిధ్వనించిన వేదఘోషతో సాగర్ తీరం భక్తిభావంతో నిండిపోయింది.

### వరుణారాధనతో విజయపురికి ప్రాచీన అనుబంధం

మహా వరుణ యాగం నిర్వహిస్తున్న ప్రాంతానికి చారిత్రక ప్రాధాన్యం కూడా ఉందని యాగ నిర్వాహకులు పేర్కొన్నారు. నేటి నాగార్జునసాగర్ ప్రాంతం ఒకనాటి విజయపురిగా ప్రసిద్ధి చెందిందని, ఈ ప్రాంతంలో ప్రాచీన కాలంలోనే వరుణారాధన జరిగినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయని వేద పండితులు వివరించారు. వరుణుడితో సంబంధం ఉన్న ఒక ప్రాచీన ప్రతిమ ప్రస్తుతం నల్లగొండ మ్యూజియంలో భద్రపరచబడి ఉందని వారు పేర్కొన్నారు. ఈ చారిత్రక నేపథ్యం కారణంగా ప్రస్తుతం జరుగుతున్న మహా వరుణ యాగానికి మరింత ఆధ్యాత్మిక విశిష్టత చేకూరిందని తెలిపారు. శతాబ్దాల కిందట జలాల కోసం ఇదే నేలపై వినిపించిన వరుణ ప్రార్థన, ఇప్పుడు మరోసారి కృష్ణమ్మ ఒడ్డున వేదఘోషగా ప్రతిధ్వనిస్తోందన్న భావన యాగానికి ప్రత్యేకతను తీసుకొచ్చింది. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి చెందిన వేద పండితులు, అర్చకులు యాగ నిర్వహణలో కీలకంగా వ్యవహరించారు. ప్రధాన అర్చకులు ఆచార్య వెంకటాచార్యులు, నరేష్ శర్మ, వెంకట రామశర్మ, ఆదిత్య శర్మతో పాటు పలువురు వేదపండితులు యాగ క్రతువులను నిర్వహించారు. రోజంతా వరుణ యాగం కొనసాగగా, మధ్యాహ్నం 3.24 గంటలకు మహా పూర్ణాహుతితో ముగిసింది.

## పీఎం ఏక్తా మాల్ టెండర్లలో

# భారీ కుంభకోణం

(మొదటి పేజీ తరువాయి)

కమర్షియల్ స్థలం కేటాయింపు తీవ్ర అనుమానాలకు తావిస్తోందని కేటీఆర్ ఆక్షేపించారు. ప్రాజెక్టులో ప్రభుత్వానికి దక్కే కనీస వాటా కేవలం 9 లక్షల చదరపు అడుగులు కాగా, ప్రైవేటు డెవలపర్‌కు మాత్రం కనీసం 18 లక్షల చదరపు అడుగుల స్థలాన్ని కేటాయించారని ఎత్తిచూపారు. అంటే, విలువైన ప్రజా భూమిని, భారీ ప్రజాధనాన్ని ఉపయోగిస్తున్నప్పటికీ ప్రైవేటు డెవలపర్‌కు ప్రభుత్వం కంటే కనీసం రెట్టింపు స్థలాన్ని కట్టబెడుతున్నారని మండిపడ్డారు.

ఎంపిక చేసిన డెవలపర్ కన్సార్టియంలో వంశీరామ్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ లీడ్ మెంబర్‌గా, అపర్ణ ఇన్ఫ్రాహౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ భాగస్వామిగా ఉన్నాయని కేటీఆర్ వివరించారు. టెండర్ మూల్యాంకనం ప్రకారం.. ఈ కన్సార్టియం ప్రభుత్వానికి లభించే కనీస వాటా కంటే అదనంగా 18,000 చదరపు అడుగుల గ్రేడ్-ఎ కమర్షియల్ స్థలాన్ని ఇచ్చేందుకు ప్రతిపాదించిందని, దీంతో ప్రభుత్వానికి దక్కే మొత్తం నిర్మిత ప్రాంతం 9.18 లక్షల చదరపు అడుగులకు చేరుతుందని తెలిపారు. అయితే, ప్రైవేటు డెవలపర్‌కు మాత్రం కనీసం 18 లక్షల చదరపు అడుగుల స్థలంతో పాటు, భవిష్యత్తు ప్రణాళికలు లేదా జూవతీఎఅంంఅఎశ్రీవ ఖీ× ద్వారా వచ్చే అదనపు ప్రాంతాన్ని కూడా పొందే హక్కును కల్పించారని పేర్కొన్నారు.

ఖరీదైన ప్రభుత్వ భూమి, కేంద్ర నిధులు మంజూరవుతున్న ప్రాజెక్టులో ప్రైవేటు డెవలపర్‌కు ఇంత భారీ మొత్తంలో కమర్షియల్ హక్కులు ఎందుకు కల్పిస్తున్నారో కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కేటాయిస్తున్న ప్రజా వనరులకు తగిన విలువ తెలంగాణ ప్రజలకు దక్కుతోందా లేదా అని ఆయన ప్రశ్నించారు.

ఈ ప్రాజెక్టు ఆర్థిక నమూనాపై కూడా కేటీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ (ూూజ×) పథకం కింద పీఎం యూనిటీ మాల్ కోసం మంజూరైన 200 కోట్ల వడ్డీ లేని రుణాన్ని తెలంగాణ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ం+ూజ) ద్వారా సదరు డెవలపర్‌కు నిధులు మళ్లించేలా టెండర్ నిబంధనలు రూపొందించారని తెలిపారు. అంతేకాకుండా, ప్రాజెక్ట్ సిద్ధం చేయడం, కన్సల్టెన్సీ, సర్వేలు, అనుమతులు, సైట్ ప్రిపరేషన్ వంటి ప్రాథమిక పనులకు ఇప్పటికే చేసిన ఖర్చును ఈ నిధుల నుంచి సర్దుబాటు చేసుకునేందుకు వెసులుబాటు కల్పించారని కేటీఆర్ తెలిపారు. ప్రజాధనాన్ని కేటాయించే ముందు ఈ ఆర్థిక నమూనాపై స్వతంత్ర దర్యాప్తు జరగాల్సిన అవసరం ఉందన్నారు. అనుమానాస్పద టెండర్లను కప్పిపుచ్చుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్ర సహాయాన్ని లేదా 'పీఎం ఏక్తా మాల్' అనే బ్రాండ్ పేరును కవచంగా వాడుకుంటున్నదని కేటీఆర్ హెచ్చరించారు. ఒక ప్రతిష్ఠాత్మకమైన పేరు ఉన్నంత మాత్రాన ఒక అవినీతి ఒప్పందం పారదర్శకంగా మారిపోదని వ్యాఖ్యానించారు. ప్రజా భూమి, ప్రజాధనం, విలువైన కమర్షియల్ హక్కులు ఉన్నచోట పరిపూర్ణమైన పారదర్శకత, స్వతంత్ర విచారణ ఉండితీరాలని స్పష్టం చేశారు. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వ పాలన, అవినీతిపై స్వయంగా ప్రధానమంత్రి, పలువురు కేంద్ర మంత్రులు బహిరంగంగా వ్యాఖ్యలు చేసినప్పటికీ, బీఆర్ఎస్ ఇచ్చిన ఫిర్యాదులపై కేంద్ర ప్రభుత్వం ఎలాంటి ప్రత్యక్ష చర్యలు తీసుకోకపోవడం అనేక అనుమానాలకు, సందేహాలకు తావిస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో జరుగుతున్న అమృత్ టెండర్ల అక్రమాలు, బొగ్గు కుంభకోణం వంటి అనేక అవినీతి వ్యవహారాలపై ఆధారాలతో సహా సదరు అధికారుల దృష్టికి తీసుకెళ్లి, స్వతంత్ర విచారణలు జరిపించాలని బీఆర్ఎస్ వరుసగా పోరాడుతోందని కేటీఆర్ గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో పీఎం ఏక్తా మాల్ టెండర్లలో వెలుగుచూసిన ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కేంద్ర నిధులు ఇందులో ఉన్నందున, ప్రజాధనం దుర్వినియోగం కాకముందే, ఉపసంహరించుకోలేని నిర్ణయాలు తీసుకోకముందే కేంద్ర ఆర్థిక శాఖ తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం ఉన్న టెండరును వెంటనే రద్దు చేయాలని, ఈ లావాదేవీపై సమగ్రమైన స్వతంత్ర విచారణ పూర్తయ్యే వరకు ఎలాంటి కేంద్ర నిధులను విడుదల చేయవద్దని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ విచారణ ద్వారా భూమి విలువ, ప్రాజెక్టు వ్యయం, ఆర్థిక నమూనా, టెండర్ నిబంధనలు, బిడ్ మూల్యాంకనం, ప్రభుత్వ వాటా, ప్రైవేటు డెవలపర్ హక్కులు మరియు కేంద్ర నిధుల వినియోగంపై స్పష్టత రావాలన్నారు. ఈ టెండర్ నిబంధనలు లేదా ఆర్థిక నమూనా వల్ల ఏదేని ప్రైవేటు సంస్థకు అనుచిత లేదా నిబంధనలకు విరుద్ధమైన లబ్ధి చేకూరిందో లేదో కూడా ఈ విచారణ తేల్చాలని కోరారు.

# సభకు అమిత్ షా వస్తారు!

(మొదటి పేజీ తరువాయి)

రప్పించేందుకు విపక్షాలు పట్టుబడుతూ, ఉభయ సభలను స్తంభింపజేస్తున్న విషయం తెలిసిందే. బాష్పవాయు గోళాలు, పెల్లెట్ గన్ల ప్రయోగం, లాఠీచార్జ్ వంటి బలప్రయోగాన్ని తప్పుబడుతున్న విషయమూ విదితమే. అలాగే, బీహార్‌లోని సివాన్‌లో నిరసనకారులపై ఓ కానిస్టేబుల్ ఏకే-47తో కాల్పులు జరపడంపైనా విపక్షాలు తీవ్ర అభ్యంతరం తెలుపుతున్నాయి. ఒక దశలో రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ కూడా విపక్షాల డిమాండ్‌ను అంగీకరించి, కేంద్ర మంత్రి అమిత్ షాను సభకు రప్పించాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజుకు సైతం విజ్ఞప్తి చేశారు. మరోవైపు, వర్షాకాల సమావేశాలు ముగిసేందుకు మరో నాలుగు రోజులే మిగిలి ఉన్న నేపథ్యంలో మహిళా కోటా బిల్లు, డీలిమిటేషన్, విదేశీ నిధుల క్రమబద్ధీకరణ సవరణ చట్టం వంటి కీలక బిల్లుల భవితవ్యం అనిశ్చితిలో పడిందని, అందుకే.. కేంద్ర మంత్రి దిగివచ్చారని విపక్షాల సభ్యులు ఎద్దేవా చేశారు.

### పార్లమెంట్ వెలుపలా విపక్షాల నిరసన

విద్యార్థులపై లాఠీచార్జిపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో స్పష్టమైన ప్రకటన చేయాలని, అలాగే, అయోధ్య రామ్ మందిర్ విరాళాల నిధుల దుర్వినియోగం ఆరోపణలపై పారదర్శక దర్యాప్తు జరపాలని డిమాండ్ చేస్తూ సోమవారం పార్లమెంట్ వెలుపల ఉన్న మకర ద్వారం వద్ద ఇండియా కూటమికి చెందిన ఎంపీలు నిరసన ప్రదర్శన నిర్వహించారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ, సమాజ్‌వాదీ పార్టీకి అధినేత, ఎంపీ అఖిలేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### ఉభయ సభల్లో 4 బిల్లులు ఆమోదం

విపక్షాల నినాదాల నడుమ ఉదయం 11 గంటలకు ఉభయసభలు ప్రారంభమయ్యాయి. రెండు సభల్లోనూ విద్యార్థులపై లాఠీచార్జి, రామ్‌మందిర్ విరాళాల వ్యవహారంపై చర్చ పెట్టాలని విపక్ష సభ్యులు పట్టుబడుతూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. సభ తిరిగి ప్రారంభమైన తర్వాత కేంద్ర న్యాయశాఖ మం త్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ ట్రిబ్యునల్ సంస్కరణల బిల్లును, బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి గనులు అభివృద్ధి నియంత్ర ణ సవరణ బిల్లును ప్రవేశపెట్టారు. చివరకు గందరగోళం మధ్యే ట్రిబ్యునల్ సంస్కరణల బిల్లును సభ ఆమోదించింది. మరోవైపు, రాజ్యసభలో నూ అదే తరహా గందరగోళం నెలకొంది.

### షా సభకు వచ్చే వరకు డెడ్‌లాక్: ప్రియాంకా గాంధీ

పార్లమెంట్ వేదికగా అమిత్ షా లాఠీచార్జిపై సమాధానం ఇచ్చేంత వరకు ఉభయ సభలు సజావుగా సాగవని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ స్పష్టం చేశారు. పార్లమెంట్ భవనం వెలుపల ఆమె మీడియాతో మాట్లాడారు. అమిత్ షా సభకు వచ్చి, సమాధానం ఇస్తే కేంద్ర ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య కొనసాగుతున్న స్తంభన (డెడ్‌లాక్) వీడదని తెలిపారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు పార్లమెం ట్‌కు వచ్చి విద్యార్థులపై లాఠీచార్జిపై సమాధానం ఇవ్వాలని తాము 20 రోజులుగా డిమాండ్ చే స్తున్నామని, ఉభయసభల్లో విపక్షాలు ఇదే డిమాండ్‌ను వినిపిస్తున్నా యని, అయినప్పటికీ కేంద్ర మంత్రి సభకు రాలేదని 'ఎక్స్' వేదికగా రాహుల్‌గాంధీ మండిపడ్డారు.

# ఉద్యమం.. ఉద్రిక్తం

(మొదటి పేజీ తరువాయి)

జార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిటీ(జేఎస్ఎస్‌సీ)ల్లో సంస్కరణలు కోరుతూ, అక్రమాలమయమైన గత పోటీపరీక్షలను రద్దుచేయాలన్న డిమాండ్లతో ఉద్యమిస్తున్న ఆందోళనకారుల నిరసన ఉద్రిక్తంగా మారింది. సోమవారం పాత అసెంబ్లీ ప్రాంగణం నుంచి కొత్త అసెంబ్లీ భవనం దాకా 'విధాన్ సభ మార్చ్'గా బయల్దేరిన వేలాది మంది విద్యార్థులు, పరీక్షార్థులు త్రివర్ణపతాకాలు, ప్రభుత్వ వ్యతిరేక నినాదాల ప్లకార్డులు చేతబూని న్యాయంకోరుతూ అసెంబ్లీకి సమీపప్రాంతానికి చేరుకోగానే పోలీసులు అడ్డుకున్నారు. జగన్నాథ్ ఆలయ రోడ్డులో చివరి అంచె బ్యారీకేడ్లను పరీక్షార్థులు బద్దలుకొట్టేందుకు యతీ?నంచగా పోలీసులు జలఫిరంగులను ఎక్కుపెట్టారు. మెరుపులా దూసుకొస్తున్న నీటి ఉధృతికి తడుస్తున్నా విద్యార్థులు అలాగే ముందుకు కదలడంతో పోలీసులు బాష్పవాయుగోళాలను ప్రయోగించారు. అయినాసరే పరీక్షార్థుల నుంచి ప్రతిఘటన పెరగడంత పోలీసులు లాఠీలకు పనిజెప్పారు. లాఠీచార్జ్‌లో చాలా మంది పరీక్షార్థులు గాయపడ్డారు. చిన్నా పెద్దా, అమ్మాయిలు అనే తేడా లేకుండా తలలు పగలగొడుతూ పోలీసులు ఇష్టమొచి?చనట్లు చితకబాదారని రక్తసిక్తమైన ఉద్యమకారుడు పీయూశ్ కుమార్ సోనీ చెప్పారు. బారికేడ్లను విజయవంతంగా దాటిన కొందరు ఉద్యమకారులు అసెంబ్లీ గేటు నంబర్ 1 వద్ద బైఠాయించి నిరసన చేపట్టారు. "శాంతియుతంగా నిరసన చేపడుతున్న మాపై లాఠీల వర్షం కురిపించారు. రక్తమోడుతున్నా ఉద్యమపంథాను వీడేదేలేదు. హేమంత్ సోరెన్ సారథ్యంలోని ప్రభుత్వం పరీక్షార్థుల డిమాండ్లను అస్సలు పట్టించుకోవట్లేదు. ఇన్నిసార్లు చర్చలు జరిపినా సానుకూలంగా స్పందించలేదు. అందుకే అసెంబ్లీ మార్చ్‌కు సిద్ధపడ్డాం"అని ఉద్యమనేతలు స్పష్టంచేశారు. "ఈరోజే సీఎం హేమంత్ పుట్టినరోజు. బర్త్‌డే రోజు బహుమానాలు ఇస్తారనుకుంటే లాఠీదెబ్బలే గిఫ్ట్‌గా ఇచ్చారు. మా డిమాండ్లు నెరవర్చేదాకా ఇక్కడి నుంచి కదిలే ప్రసక్తే లేదు. లాఠీచార్జ్‌తో పోలీసులు శారీరక దెబ్బకొట్టగలరేమోగానీ మా ఆలోచనలను దెబ్బతీయలేరు"అని ఉద్యమనేతలు ప్రకటించారు.

### బల ప్రయోగం.. బాష్పవాయుగోళాలు..

నిరాహారదీక్షలు, ఉద్యమం ఆరంభమై 16 రోజులు గడిచినా చర్చల్లో ఎలాంటి పురోగతి కని?పంచకపోవడం, డిమాండ్లకు ప్రభుత్వం ఒప్పుకోకపోవడంతో సోమవారం ఉదయం 10.30 గంటలకు ధుర్వాలోని ఓల్డ్ అసెంబ్లీ కాంప్లెక్స్ నుంచి వేలాదిగా ఉద్యమకారులు ర్యాలీగా బయల్దేరారు. 9 రోజులుగా నిరాహారదీక్ష చేస్తూ పది కేజీల బరువు తగ్గిన ఉద్యమనేత దేవేంద్రనాథ్ మహతో సైతం అంబులెన్స్‌లో అసెంబ్లీ వైపుగా కదిలారు. జేఎస్ఎస్‌సీ పరీక్షల్ని రద్దుచేయాలి. సీబీఐ విచారణ జరపాలి. జేఎస్ఎస్సీపై దాడులకు సీఐడీ ఎందుకు జంకుతోంది? అన్న ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఉద్యమకారులు ముందుకు కదిలారు. నాలుగు కిలోమీటర్ల ఈ మార్గంలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, ఇండియన్ రిజర్వ్ బెటాలియన్, జిల్లా పోలీసులు, క్విక్ రెస్పాన్స్ టీమ్ బృందాలు మోహరించాయి. ఒక్కో బారికేడ్‌ను దాటుకుంటూ పరీక్షార్థులు ముందుకొచ్చేకొద్దీ వాళ్లను పోలీసులు నిలువరించే ప్రయత్నంచేశారు. ఈ క్రమంలో తొలుత వాగ్వాదం జరిగింది. శాసనసభలో మా డిమాండ్లు విని?పంచకపోతే న్యాయం ఎలా జరుగుతుంది? అని పోలీసులతో ఉద్యమకారులు వాగ్వాదానికి దిగారు. ఈ సమయంలో తోపులాట జరగడంతో పోలీసులు జలఫిరంగులను ప్రయోగించారు. అయినాసరే ఉద్యమకారులు వెనక్కి తగ్గకపోవడంతో పోలీసులు తొలత టియర్‌గ్యాస్ షెల్స్‌ను, తర్వాత లాఠీలను ప్రయోగించిచారు. తమపై విద్యార్థులు రాళ్లదాడి చేయడంతోనే లాఠీచార్జ్ చేయాల్సి వచి?చందని రాంచీ సిటీ ఎస్పీ పరాశ్ రాణా చెప్పారు. నిరసనకారుల దాడిలో నలుగురు పోలీసులు తీవ్రంగా గాయపడినట్లు ప్రకటించారు. చర్చల పర్వం కొనసాగుతుండగా ర్యాలీ చేపట్టడమేంటని ప్రభుత్వం అసహనం వ్యక్తంచేసింది. 98 శాతం డిమాండ్లకు ఒప్పుకున్నాసరే ఉద్యమపంథాను ఎందుకు వీడట్లేరని ప్రభుత్వం నిలదీసింది. అయితే 13 పరీక్షల్ని రద్దుచేయాలంటే కనీసం మూడు పరీక్షలకే ఒప్పుకున్నారని, జేపీఎస్‌సీ, జేఎస్ఎస్‌లో సంస్కరణల ఊసే ఎత్తేట్లేరని, సీబీఐ విచారణకు ప్రభుత్వం సాహసించట్లేదని ఉద్యమకారులు ఆరోపించారు.

### జేపీఎస్సీ మాజీ చైర్‌పర్సన్ అరెస్ట్

జార్ఖండ్‌లో ప్రభుత్వ ఉద్యోగాల నియామక ప్రక్రియలో అక్రమాలు చోటుచేసుకున్నాయన్న ఆరోపణలపై జేపీఎస్సీ మాజీ ఛైర్‌పర్సన్, 1988 బ్యాచ్ ఐఏఎస్ అధికారి ఎల్.ఖియాంగ్టేను సోమవారం జార్ఖండ్ సీఐడీ అధికారులు అరెస్ట్‌చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామాచేశాక గత ఏడాది ఈయనను ప్రభుత్వం జేపీఎస్సీ ఛైర్‌పర్సన్‌గా నియమించింది. గత నెలలో ఈయనను సీఐడీ నాలుగుసార్లు ప్రశ్నించింది.



# రాగినేడులో ఘనంగా హర్ ఘర్ తిరంగా యాత్ర

- జాతీయ జెండా ఆవిష్కరణ.. భారత్ మాతాకీ జై నినాదాలతో ర్యాలీ

**పెద్దపల్లి ప్రతినిధి, ఆగస్టు 10 (ప్రజా తీర్పు)**

భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా రాగినేడు గ్రామంలో జాతీయ జెండా ఆవిష్కరణ, తిరంగా యాత్రను ఘనంగా నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు వేల్పుల రమేష్, మండల కన్వీనర్ ఇల్లందు అంజి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి మేకల విజయ్‌కుమార్, బీజేపీ సీనియర్ నాయకుడు పొన్నం మధురయ్య పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల గుండా 'భారత్ మాతాకీ జై', 'వందేమాతరం' నినాదాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. దేశభక్తి, జాతీయ సమైక్యతను పెంపొందించేలా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు తంగేడ రాజేశ్వర్‌రావు, తాళ్ల లక్ష్మణ్, మండల ప్రధాన కార్యదర్శి మామిడి ఉమేష్, ముంజ రాజేంద్రప్రసాద్, పడాల నరసయ్య, చింతపండు స్వామి, దండు చంద్రయ్య, గుంటుకు సది, మేడగొని శివయ్య, యువమోర్చా అధ్యక్షుడు రెడ్ల వేణు, ముత్యం సాగర్, ముసారి రవి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజల నమ్మకమే అతని శ్వాస, ప్రజా సేవలో పాల్గొనడమే ఆయన పని ...

- డోర్నకల్ గడ్డే ఆయన పురిటి గడ్డ...
- ఎవరికి తల్లోగని నాయకుడు మాలోతు నెహ్రూ నాయక్...
- కాబోయే డోర్నకల్ ఎమ్మెల్యే గా మాలోతు నెహ్రూ నాయక్
- ఇదీ డోర్నకల్ నియోజకవర్గ ప్రజల మనసులో ఉన్న మాట నిజమే..

**కురవి ఆగస్టు 10 ( ప్రజా తీర్పు విలేఖరి)**



కష్టపడే వ్యక్తి కి ఎక్కడైనా చోటు ఉంటది అనే నిదర్శనం మన డోర్నకల్ నియోజకవర్గ పరిధిలో ఉన్న మండలాల్లో జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో ఇటీవల జరిగిన పరిణామాలలో ఎవరికి వారు యమునా తీరు అన్న రీతీలో చేస్తూ పోతే ఇక పోరాడే యువ శక్తి సామర్థ్యాలకు మించి ఎక్కువ శ్రమ పడ్డ,ఫలితం లేకుండా పోయి ప్రజల కోసమే,తను ఎల్లప్పుడూ తపన పడుతూ, డోర్నకల్ నియోజకవర్గ ప్రజలే నాకు దేవుళ్ళు గా భావించుకొంటూ ప్రతి ఒక్కరూ తో అతనితో అవినాభావ సంబంధాన్ని బలోపేతం చేయడానికి,దోహదపడే అనేక అంశాలను ప్రభావితం చేస్తున్న, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు,కాబోయే డోర్నకల్ శాసన సభ్యులు మాలోతు నెహ్రూ నాయక్ అతని గొప్ప మనస్సున్న వ్యక్తి గా నిలిచిన మహానుభావుడు గా డోర్నకల్ నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే నాయకులు గా చాలా గుర్తింపు పొందిన వ్యక్తి గా ఉన్నారు.ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో కూడా డోర్నకల్ నియోజకవర్గ కాబోయే ఎమ్మెల్యే, మాలోతు నెహ్రూ నాయక్ పేరు వినిపించుటలో సందేహం లేదని డోర్నకల్ నియోజకవర్గ ప్రజలు గుసగుసలాడుతూ కొంతమంది బహిరంగంగానే చెప్పకనే చెపుతున్నారు.అదే కాకుండా నియోజకవర్గ ప్రజలకు వెన్నంటే ఉంటూ,ప్రజల భాధలను తెలుసుకోని వారికి ఏ కష్టం వచ్చినా,కాకితో కబురు అందిన వెనువెంటనే బాధపడుతున్న వారి దగ్గరకు వచ్చి వారి భాధలను పాలు పంచుకుంటారు.అదే విధంగా వారికి ఆర్థిక సహాయమే కాకుండా వారికి అన్ని విధాలా అండగా ఉంటూ,వారి ఆప్యాయత ను చాటుకోంటున్నారు.నియోజకవర్గ ప్రజలు ఈ సారి తప్పు చేయ్యకుండా నియోజకవర్గ ప్రజలందరూ ఏన్నటీకైనా మాలోతు నెహ్రూ నాయక్ కు టికెట్ ఇప్పించి,గెలిపించే బాధ్యతను కూడా తీసుకుంటామని నియోజకవర్గ ప్రజలు బహిరంగంగానే అనుకుంటూ,ముందుకు సాగుతున్నారు.ఇది కాదా ఒక నాయకుడికి ఉండాల్సిన మంచి లక్షణాలు అని నియోజకవర్గ ప్రజలు అంటున్నారు.

# అంజన్న సన్నిధిలో మంగ్లి...

- కొండగట్టు అంజన్నను దర్శించుకున్న ప్రముఖ గాయని మంగ్లీ

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) ఆగష్టు 10.**



ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి వారిని సోమవారం ప్రముఖ జానపద, సినీ గాయని మంగ్లీ దర్శించుకున్నారు. మంగ్లీ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మంగ్లి మాట్లాడుతూ అంజన్న ను దర్శించుకోవడం ఆనందంగా ఉందని, ఈ ప్రాంతం షూటింగ్ లకు అనువైన స్థలం అని కొనియాడారు. అనంతరం వేద పండితులు ఆశీర్వాదం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయంలో భక్తులు మంగ్లి తో ఫోటోలు దిగేందుకు పోటీ పడ్డారు.



# కీ:శే: కత్తి భవాని కి నివాళి

**నర్సంపేట టౌన్ ఆగస్టు 10 ప్రజా తీర్పు**

టి పి సి సి అధికార ప్రతినిధి ప్రొఫెసర్: కత్తి వెంకట స్వామి గౌడ్ సతీమణి లికత్తి భవాని గత పది రోజులకు పరమవదించగా నేడు దశదినకర్మ సందర్భంగా హైదరాబాదులోని వారి స్వగృహంలో భవాని చిత్రపటానికి పుష్పాలు సమర్పించి నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు, మున్సిపాలిటీ మాజీ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్య గౌడ్, గోప జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పంజాల వెంకట్ గౌడ్, బిసి వెల్ఫేర్ జిల్లా ఉపాధ్యక్షులు సోల్తి సారయ్య గౌడ్, డివిజన్ గోప అధ్యక్షులు రామ గోని సుధాకర్ గౌడ్, వ్యాపారవేత్త కత్తి వెంకటేశ్వర్లు గౌడ్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నా నాయకులు ఎండి నిజాం తదితరులు పాల్గొన్నారు.

# శ్రావణమాసం ఏర్పాట్లపై ఈవో ప్రత్యేక దృష్టి

## వేములవాడ దేవస్థానం పరిధిలోని అన్ని అనుబంధ ఆలయాల్లో భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు చర్యలు

**(పాష సయ్యద్, ప్రజాతీర్పు వేములవాడ) ఆగస్టు 10**



వేములవాడ రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం పరిధిలోని అన్ని అనుబంధ ఆలయాల్లో రాబోయే శ్రావణమాసం సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లను ఆలయ ఈవో శ్రీమతి ఎల్. రమాదేవి పరిశీలించారు.శ్రావణమాసంలో భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా నాగుల పంచమి సందర్భంగా భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉన్నందున, ఆలయాల వద్ద క్యూలైన్లు, దర్శన ఏర్పాట్లు, భక్తుల రాకపోకలు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులతో పాటు స్థానిక గ్రామ ప్రజలు, మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉన్నందున, వారి సౌకర్యార్థం ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేసి, దర్శనం సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే అన్ని అనుబంధ ఆలయాల పరిసరాల్లో పారిశుధ్యం, తాగునీరు, భక్తుల సౌకర్యాలు, భద్రతా చర్యలు తదితర అంశాలను ముందుగానే సిద్ధం చేయాలని, శ్రావణమాసం మొత్తం భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఈవో రమాదేవి ఆదేశించారు. ఈ సందర్భంగా డీఈవో నవీన్ కుమార్, డి ఈ రామ్ కిషన్ రావు , ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, నరేందర్, ఆలయ అర్చకులు, వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.



# యువ న్యాయవాది అరుణ్‌కుమార్ కుటుంబానికి పెర్క శ్యామ్ పరామర్శ

**పెద్దపల్లి ప్రతినిధి, ఆగస్టు 10,(ప్రజా తీర్పు):**

ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన యువ న్యాయవాది బచ్చలి అరుణ్‌కుమార్ కుటుంబాన్ని టీపీసీసీ నాయకులు, జననేత పెర్క శ్యామ్ పరామర్శించారు. బీఎస్ఎన్ఎల్ మాజీ ఉద్యోగి బచ్చలి రాజయ్య కుమారుడైన అరుణ్‌కుమార్ మృతి పట్ల శ్యామ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, విషాద సమయంలో వారికి అండగా ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కొలనూరు సర్పంచ్ కనకయ్య, ఐఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు మేకల సతీష్, ఎరవెల్లి రమేష్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

# ఇంటెలిజెంట్ ఐఓటీ నెట్ వర్క్ ఆప్టిమైజేషన్ పై పరిశోధనకు పీహెచ్.డీ

**పటాన్ చేరు, ఆగస్టు 10 (ప్రజాతీర్పు)**



హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం పరిశోధక విద్యార్థి యన్నం భరత్ భూషణ్ డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'ఐఓటీ నెట్ వర్కులలో ఉమ్మడి వనరుల కేటాయింపు, రద్దీ–అవగాహన రౌటింగ్ కోసం హైబ్రిడ్ ఆప్టిమైజేషన్ వ్యూహాలు: మెటాహ్యూరిస్టిక్, క్వాంటం–ఆధారిత ఫ్రేమ్ వర్కులపై ఒక సమగ్ర అధ్యయనం' చేసి, ఆయన సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ అండ్ సిస్టమ్స్ ఇంజనీరింగ్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.అపర్ణ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సిద్ధాంత వ్యాసం, భారీ–స్థాయి ఐఓటీ వాతావరణాలలో శక్తి సామర్థ్యం, వనరుల కేటాయింపు, కంజెషన్–అవేర్ రౌటింగ్, నెట్ వర్కు పనితీరును మెరుగుపరచడానికి వినూత్న హైబ్రిడ్ ఆప్టిమైజేషన్ నమూనాలను అందిస్తుందని వివరించారు. ఈ పరిశోధన, స్కేలబిలిటీని మెరుగుపరచడానికి, కమ్యూనికేషన్ ఆలస్యాన్ని తగ్గించడానికి, వనరుల నిర్వహణను ఆప్టిమైజ్ చేయడానికి, అధునాతన జీవ–ప్రేరిత మెటాహ్యూరిస్టిక్ అల్గారిథమ్, క్రాస్–లేయర్ ఆప్టిమైజేషన్, ఇంటెలిజెంట్ ఎడ్జ్–ఫాగ్–క్లౌడ్ కంప్యూటింగ్ ఫ్రేమ్ వర్కులను ఏకీకృతం చేస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతమున్న ఐఓటీ ప్రోటోకాల్ లతో పోలిస్తే, శక్తి సామర్థ్యం, లేటెన్సీ, త్రూపుట్, రూటింగ్ స్థిరత్వం, నెట్ వర్కు జీవితకాలంలో గణనీయమైన మెరుగుదల ఉందని సిమ్యులేషన్ ఫలితాలు నిరూపించాయన్నారు. ఈ పరిశోధన ఫలితాలకు స్మార్ట్ సిటీలు, ఆరోగ్య సంరక్షణ, పారిశ్రామిక ఐఓటీ, ప్రెసిషన్ అగ్రికల్చర్, పర్యావరణ పర్యవేక్షణ, ఇంటెలిజెంట్ ట్రాన్స్ పోర్టేషన్ సిస్టములలో విస్తృతమైన అనువర్తనాలు ఉన్నాయని తెలిపారు. ఇవి తదుపరి తరం ఐఓటీ మౌలిక సదుపాయాల అభివృద్ధికి దోహదపడతాయని ఆశాభావం వ్యక్తపరిచారు. డాక్టర్ భరత్ సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, కంప్యూటర్ సైన్స్ అండ్ సిస్టమ్స్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర ఎస్.మహబూబ్ బాషా, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



# జైలు భరోస విజయ వంతం...

- పాల్గోన్న రైతు సంఘం,సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం

**కురవి ఆగస్టు 10(ప్రజా తీర్పు విలేఖరి)**

కురవి మండల కేంద్రంలో బస్టాండ్ నుండి వీరభద్ర స్వామి ఆలయం దగ్గర నుండి జాతీయ రహదారి ర్యాలీగా వెళ్లి పెట్రోల్ బంకు దగ్గర రాస్తారోకో నిర్వహించడం జరిగింది.అనంతరం, సిఐటియు రైతు సంఘం,వ్యవసాయ కార్మిక సంఘం, నాయకులు నల్లపు సుధాకర్,పోతుగంటి మల్లయ్య,గంధసిరి శ్రీనివాస్ లు మాట్లాడుతూ. కేంద్ర రాష్ట్ర,ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక కార్మిక,కర్షక,రైతు అవలంబిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా విజయవంతం చేశారని వారు అన్నారు.ఆగస్టు 10 న జైల్ భరో కార్యక్రమాన్ని,రాస్తారోకో విజయవంతం చేశారని వారన్నారు.కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కొడ్స్ లను రద్దు చేయాలని,రైతు నల్ల చట్టాలను రద్దు చేయాలని వ్యవసాయ కూలీలు పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని మార్పు బి బి జి రామ్ పథకాన్ని తీసుకురావడం జరిగింది.దీనివలన గతంలో కేంద్ర ప్రభుత్వం 90% నిదులిస్తే,రాష్ట్ర ప్రభుత్వాలు 10 శాతమే ఇచ్చేవారు.కానీ ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం 60 శాతం,రాష్ట్ర ప్రభుత్వం 40% ఇవ్వాలని చెప్పడం జరుగుతుంది.దీనివలన ఉపాధి హామీ పని రద్దు చేయాలనే యోజన లో కేంద్ర ప్రభుత్వం ఉన్నదని,కేంద్ర ప్రభుత్వం విద్యుత్ రంగంలో కూడా ఉచితలను తీసివేసే జీవోలు తీసుకురావడం జరిగిందని,ప్రభుత్వం ఆ జీవోలను కూడా రద్దు చేయాలని అన్నారు.బిజెపి తీసుకొచ్చిన కార్మిక,కర్షక రైతు ప్రజా వ్యతిరేక చట్టాలని తక్షణమే రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన వారికి పెన్షన్స్, ఇందిరమ్మ ఇండ్లు,ఇంటి పట్టాలు,ఇండ్ల స్థలాలు,రైతులు రైతుల సాగులో ఉన్న వ్యవసాయ భూమికి పట్టాలు ఇవ్వాలనే డిమాండ్ చేశారు కడియం సత్యం,మాలోత్ కిషన్,కట్ల కృష్ణయ్య, మల్సూర్,కొర్ని రాములు, కొండ బత్తుల వెంకన్న,జక్కుల మల్లయ్య,మల్లేష్,నాలం వెంకన్న, గోపి,చారి, లచ్చయ్య,నిర్మల, ఆశా వర్కర్లు,గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.



# కందికొండ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష,ఉపాధ్యక్షులు ఏకగ్రీవ ఎన్నిక...

**కురవి ఆగస్టు 10 (ప్రజా తీర్పు విలేఖరి)**

కురవి మండలం లోని కందికొండ గ్రామంలో డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డా.రామచంద్రు నాయక్,మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఉమా – మురళి నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు బండి శ్రీనివాస్ గౌడ్,కురవి మండల అధ్యక్షులు బాలగాని శ్రీనివాస్ ఆదేశానుసారం కందికొండ గ్రామ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.అనంతరం ఎన్నికైన వారికి కండువా కప్పి స్వాగతించిన మార్కెట్ డైరెక్టర్ బండి శైలజ – రమేష్,కందికొండ గ్రామ మాజీ అధ్యక్షులు దువ్వ సైదులు,సర్పంచ్ తోడుసు నాగార్జున,ఉపసర్పంచ్ కోర్ని సునీత – నరేష్(చందు), సీనియర్ కాంగ్రెస్ నాయకులు ముత్తిలింగం, వెంకన్న, రాముఉపేందర్, అమీర్, యాకుబ్ పాషా, ఏ.నరేష్, భాస్కర్, రజినీకాంత్, లాలీజన్ పాషా,టి,నరేష్ వార్డ్ సభ్యులు ఇసకర్,దేవేందర్,మహేష్, వెంకటేష్,నరేష్,అజిత్,పున్ని,తదితరులు ఉన్నారు.

# ముందు చూపు లేదు.. వరుణ యాగం చేస్తారట...

- మాజీ మంత్రి, బి ఆర్ ఎస్ రాష్ట్ర కార్యదర్శి జీవన్ రెడ్డి...

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) ఆగస్టు 10.**



జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీ ఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి వర్యులు, బీ ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి జగిత్యాల జిల్లా పరిషత్ తొలి మాజీ ఛైర్పర్సన్ దావా వసంత సురేష్, బీ ఆర్ ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాజీ మంత్రి జీవన్ రెడ్డి మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావంతో ఉత్పన్నం అయ్యే పరిణామాల్ని అధిగమించేందుకు గత ఆరు మాసాలుగా హెచ్చరించిన పట్టించుకోకుండా ఇప్పుడు వరుణ యాగం చేస్తుండడం విస్మయం కలుగుతుంది. అదృష్టం కొద్ది ఇటీవల వర్షాలతో శ్రీశైలం ప్రాజెక్ట్ కూడా ఫుల్ ట్యాంక్ లెవల్ వరకు నిండింది. రేవంత్రెడ్డి ముప్పయి మాసాలు నిద్ర పోయారు. మహారాష్ట్ర తో చర్చలు చేయాలని ఉంటే ఇప్పటి వరకు ఏం చేశారు. ప్రభుత్వం చేయాల్సిన పనిచేయకుండా వరుణ యాగం..చేస్తే ఎలా.. ఇప్పటికే దేవుడు కరుణించి వర్షాలు కురిశాయి . మరి వర్షాలు కురవాలని కోరుకుంటున్న. గతంలో ఆమోదం పొందిన ప్రాజెక్ట్ లను పునః పరిశీలించే అవకాశం లేదు.. కేసీఆర్ దూరదృష్టితో కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టారు. కేసీఆర్ తెలంగాణ రాష్ట్రానికి భవిషత్ చూపెట్టారు. ఆమోదం పొందిన ప్రాజెక్ట్ లకు చంద్ర బాబు నాయుడు గోదావరి రివర్ మేనేజ్మెంట్ బోర్డ్ వద్ద అభ్యంతరం తెలుపడం ఏమిటి.. తెలంగాణ హక్కులను కాజే సే కుట్రలు కొనసాగుతున్నాయి. చంద్రబాబు నాయుడు కుట్రలు కుతంత్రాలతో అసలుకే మోసం వస్తుంది. చంద్రబాబు నాయుడు పట్ల రేవంత్ రెడ్డి కి గురు భక్తి తో.. తెలంగాణ ప్రజల హక్కులను తాకట్టు పెట్టడం ఏమిటి.. మొదటి దఫాలో .. ఓటు కు నోటు కేసులో ఇరుక్కోవడంతో నోరు మెదపలేదు.. చంద్ర బాబు నాయుడు తెలంగాణ వైపు కన్నెత్తి చూసే ధైర్యం చేయలేకపోయారు.. చంద్ర బాబు డైరెక్షన్ కు అనుగుణంగా ఓటు కు నోటు అమలు చేసింది రేవంత్ రెడ్డి.. గురు శిష్యులు మళ్ళీ అవే కుట్రలు.. కుతంత్రాలు చేస్తున్నారు. గురు శిష్యుల అనుబంధం తో తెలంగాణ హక్కులు కాలరాస్తున్నారు. వరుణ యాగంతో రేవంత్ రెడ్డి కి. ఉత్తమ్ కుమార్ రెడ్డి కి జ్ఞానోదయం కావాలి.. యాగాలు మంచివే..వాటితో ఫలితాలు ఉంటాయి..కానీ మానవ ప్రయత్నం చేయకుండా.. యాగాలు చేస్తే ఎలా... రేవంత్ రెడ్డి.. ఉత్తమ్ కుమార్ చేతులు ఎత్తేశారు.. ఇక ప్రభుత్వ పాలన దేవుడే చూసుకోవాలి... మోడీ కి రేవంత్ రెడ్డి కి ఉన్న సాన్నిహిత్యం తో అనుమతులు ఇప్పిస్తే సంతోషం.. ప్రాజెక్ట్ ల నిర్మాణం లో జాప్యం చేస్తే ప్రజలు క్షమించారు అని జీవన్ రెడ్డి హెచ్చరించారు. తొలి జిల్లా పరిషత్ చైర్మన్ దావ వసంత సురేష్, శీలం ప్రవీణ్, మాజీ కౌన్సిలర్ దుర్గయ్య, సాయి తదితరులు ఉన్నారు.

# కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి లెల్లల బాలకృష్ణ
- జగిత్యాలలో జైల్ బరో పేరుతో ఆందోళన

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) ఆగష్టు 10.**




కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతి ఒక్కరూ ఎండ గట్టాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి,సీపీఎం జిల్లా ఇంచార్జి లెల్లల బాలకృష్ణ పిలుపునిచ్చారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్పోరేట్ సంస్థలకు అండగా ఉంటూ కార్మిక,రైతు, ప్రజలకు వ్యతిరేకంగా పనిచేస్తుందని ఆరోపిస్తూ క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో జగిత్యాల జిల్లా కేంద్రంలోని కొత్త బస్ స్టాండ్ చౌరస్తాలో సోమవారం జైల్ బరో నిరసన కార్యక్రమాన్ని సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆద్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా చేపట్టారు. నాయకుల ధర్నాను పోలీసులు అడ్డుకుని అరెస్టులు చేసి ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ జిల్లా ఇంచార్జి బాలకృష్ణ, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్, ఐఎఫ్టి యూ జిల్లా కార్యదర్శి చింత భూమేశ్వర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు ఇందూరి సులోచనలు మాట్లాడుతూ అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం,ఐకెపి వివోఏ, ఫీల్డ్ అసిస్టెంట్, ఆరోగ్య శాఖలో వివిధ స్కీంలో కోటి మంది వర్కర్లు పని చేస్తున్నా నేటికి ఉద్యోగ భద్రత, కనీస వేతనానికి నోచుకోలేదన్నారు. కార్మికుల హక్కులను కాలరా స్తూ కేంద్రం తీసుకవచ్చిన నాలుగు లేబర్ కొడులను తక్షణమే రద్దు చేయాలన్నారు. రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధరలు అమలు చేయక పోవడంతో ఏటా రూ.4 లక్షల కోట్లు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆహార భద్రతా చట్టానికి కేంద్ర తూట్లు పొడిచి అంత్యోదయ పథకం ద్వారా నిరుపేదలకు 35 కిలోల బియ్యాన్ని రద్దు చేసి ఒక్కో మనిషికి 7 కేజీల బియ్యాన్ని మాత్రమే ఇస్తుందని మండిపడ్డారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ చేసేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని దీన్ని నిలువరించేందుకు ప్రజలు ఆందోళనలకు సిద్దంగా ఉండలన్నారు. ఇప్పటికయినా కేంద్రం ప్రజా వ్యతిరేక విధానాలను మానుకోవాలని హితవు పలికారు. ఈ ఆందోళన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోమటి శేఖర్,సీపీఎం జిల్లా నాయకుడు భూతం సారంగ పాణి, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నాయిని శారద, నాయకులు జంగిలి ఎల్లయ్య, మాల్యాల సురేష్, వెల్మలపల్లి వేంకట చారి తదితరులు ఉన్నారు.

# సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరించాలి

- ఆగస్టు 23 చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి
- ఉద్యోగ–ఉపాధ్యాయుల భవిష్యత్తు కోసం ఐక్య ఉద్యమం: బాణోతు లక్ష్మ

**(పొనకంటి ఉపేందర్ రావుప్రజాతీర్పు) ఆగస్టు 10**



టేకులపల్లి :రాష్ట్రంలో 2004 నుంచి అమలులో ఉన్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (జూూ)ను తక్షణమే రద్దు చేసి, ఉద్యోగులు--ఉపాధ్యాయులకు భద్రత కల్పించే పాత పెన్షన్ విధానం (ూూూ)ను పునరుద్ధరించాలని తెలంగాణ దివ్యాంగ ఉద్యోగ ఉపాధ్యాయ సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి బాణోతు లక్ష్మ ప్రభుత్వాన్ని త్వరగా పరిష్కారం చేయాలనీ కోరారు. జీవితాంతం ప్రభుత్వ సేవలో ఉన్న ఉద్యోగులకు పదవీ విరమణ అనంతరం గౌరవప్రదమైన జీవితం గడిపేలా పెన్షన్ భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. జూూ విధానం వల్ల పదవీ విరమణ అనంతరం అనేక మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సరిపడా పెన్షన్ లభించక వృద్ధాప్యంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "ప్రభుత్వ ఉద్యోగం చేసిన తర్వాత కూడా వృద్ధాప్యంలో ఆర్థిక భద్రత లేకపోవడం అత్యంత బాధాకరం. ఉద్యోగుల భవిష్యత్తుకు భరోసా కల్పించేది ఓ పి ఎస్ మాత్రమే" అని అన్నారు. రాష్ట్ర ఉద్యోగ--ఉపాధ్యాయులకు సంబంధించిన పలు సమస్యలు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయని బాణోతు లక్ష్మ తెలిపారు. ూ=జ ఆలస్యం, పెండింగ్ ణూలు, జూూ బకాయిలు, ఉద్యోగుల బదిలీలు, ప్రమోషన్లు తదితర సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు . ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో కాలయాపన చేయకుండా ప్రభుత్వం చర్చలు జరిపి న్యాయం చేయాలని కోరారు. "ఒక్క శాఖ కాదు... రాష్ట్ర ఉద్యోగులంతా ఒక్కటే" అని ఆయన పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, ఇంజనీర్లు, వైద్యులు, నర్సులు, పోలీసులు, ఫైర్‌మెన్, రెవెన్యూ, ట్రెజరీ, ఫారెస్ట్, పంచాయతీ, మున్సిపల్ తదితర అన్ని శాఖల ఉద్యోగులు తమ భవిష్యత్తు కోసం ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగ--ఉపాధ్యాయుల ఐక్య గళం ఒక్కటే---మాకు కావాలి ూూూ, జూూ రద్దు--ూూూ పునరుద్ధరణ" అని స్పష్టం చేశారు. జూూ రద్దు, ూూూ పునరుద్ధరణతో పాటు ఉద్యోగ--ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆగస్టు 23న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని బాణోతు లక్ష్మ పిలుపునిచ్చారు. "ఎంతకాలం ఈ మౌనం? ఎంతకాలం ఈ నిస్సహాయత? మన భవిష్యత్తు కోసం ఇప్పుడే ఉద్యమించాలి. పాత పెన్షన్ సాధించే వరకు ఐక్యంగా పోరాడాలి" అని ఆయన అన్నారు. జూూ రద్దు -- ూూూ పునరుద్ధరణ సాధించే వరకు పోరాటం! చేయాలని తెలిపారు.




# మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రాస్తారోకో

- కార్పోరేట్లకు దేశ సంపద దోచి పెడుతున్న మోడీ
- కార్మిక, కర్షక ఐక్యతతో పోరాడుదాంలిరేపాకుల శ్రీనివాస్
- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

**(పొనకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు) ఆగస్టు 10**

టేకులపల్లి :మోడీ ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ టేకులపల్లి మండల కేంద్రం బోడు రోడ్డు సెంటర్ లో భారీ రాస్తారోకో.జైల్ భరో సక్సెస్. :మోడీ ప్రభుత్వం కార్మిక,కర్షక, ప్రజా వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు.సోమవారం నాడు

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ టేకులపల్లి మండల కేంద్రంలో సిఐటియు, రైతు ,వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ రాస్తారోకో నిర్వహించారు,ఈ సందర్భంగా కుంజ హైమావతి అద్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ పరాయి పాలన పోవాలని క్విట్ ఇండియా ఉద్యమం జరిగిందని, నేడు మోడీ ప్రభుత్వం, కార్పోరేట్లతో కలిసి కార్మికులకు, రైతులకు, దేశ ప్రజలకు వ్యతిరేకంగా చేస్తున్న పాలన పోవాలని జైల్ భరో కార్యక్రమం దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్నామన్నారు. కార్పోరేట్ల ప్రయోజనం కోసం ఏకపక్షంగా మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను మార్చిందన్నారు.నాలుగు లేబర్ కోడులను తెచ్చి కార్మికుల హక్కులు కాలరాసిందన్నారు, వ్యవసాయ ఉత్పత్తులను దిగుమతి చేసుకోవడం కోసం విదేశాలతో చేసుకున్న వాణిజ్య ఒప్పందాలు రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని,వీబీజీరామ్ జి చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు, నూతన విత్తన, విద్యుత్ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు, రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధరల చట్టం చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు ఈసం నరసింహారావు, కడుదుల వీరన్న, సీఐటీయూ మండల కన్వీనర్ కుంజ హైమావతి, రైతు సంఘం మండల కార్యదర్శి పూనెం స్వామి, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి కుంజ రమేష్,కోయగూడెం వార్డు మెంబర్ పూనెం చంద్రశేఖర్,ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు పూనెంశిరోమణి,బి.లక్ష్మి,జి.లక్ష్మి. ,విద్య, మంగ, చైతన్య,మాధవి,ఈసం రామకృష్ణ, నాగేంద్రబాబు,పూనెం బుచ్చయ్య,ప్రేమ్ కుమార్, సుదర్శన్,మాడె శేఖర్,చింత రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ అభివృద్ధికి టెక్నాలజీ తోడు

- రోడ్డు పనుల్లో వేగం, నాణ్యత కోసం అజాక్స్ కాంక్రీట్ యంత్రం

**( వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్) ఆగస్టు 10**



కరీంనగర్ లో అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేస్తూ, నాణ్యతా ప్రమాణాలను పెంచే దిశగా నగర పాలక సంస్థ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించేందుకు అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా 35వ డివిజన్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు అత్యాధునిక "అజక్స్ సెల్ఫ్ లోడింగ్ "కాంక్రీట్ మిక్సర్ యంత్రాన్నివినియోగిస్తూ నగర మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ పనులను ప్రారంభించారు. సంప్రదాయ పద్ధతులతో పోలిస్తే అజక్స్ యంత్రం ద్వారా కాంక్రీట్ తయారీ, మిశ్రమ నిష్పత్తుల నియంత్రణ, నిర్మాణ ప్రాంతంలోనే కాంక్రీట్ సిద్ధం చేయడం, వేగవంతమైన సరఫరా వంటి ప్రయోజనాలు లభిస్తాయి. దీని వల్ల పనుల అమలు సమయం తగ్గడంతో పాటు నిర్మాణ నాణ్యత కూడా మెరుగుపడుతుందని అధికారులు తెలిపారు.

ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ,"అభివృద్ధి పనులు ప్రారంభించడం మాత్రమే కాదు, వాటిని నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం అత్యంత ముఖ్యమైన విషయం. అందుకే ఆధునిక యంత్ర సాంకేతికతను వినియోగిస్తూ రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నాం" అని తెలిపారు.

### వేగం పెరగాలి – నాణ్యత తగ్గకూడదు

రోడ్డు నిర్మాణ పనుల్లో వేగంతో పాటు నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని మేయర్ స్పష్టం చేశారు. కాంక్రీట్ నాణ్యత, సరైన మిశ్రమ నిష్పత్తులు, రోడ్డు మందం, క్యూరింగ్ వంటి అన్ని అంశాల్లో ఇంజినీరింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. నగరంలో రోడ్డు పనులు ఎక్కువ కాలం కొనసాగడం వల్ల ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటారని, అందువల్ల ఆధునిక యంత్రాల సహాయంతో సాధ్యమైనంత తక్కువ సమయంలో పనులను పూర్తి చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. 35వ డివిజన్‌లో ప్రారంభించిన ఈ విధానాన్ని పరిశీలించి, అవసరాన్ని బట్టి నగరంలోని ఇతర డివిజన్లలో చేపట్టే సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఇతర కాంక్రీట్ నిర్మాణ పనుల్లో కూడా ఆధునిక యంత్ర సాంకేతికతను వినియోగించేందుకు చర్యలు తీసుకుంటామని మేయర్ తెలిపారు."కరీంనగర్ వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరం. అందుకు అనుగుణంగా మన పని విధానాలు కూడా మారాలి. పాత పద్ధతులకు పరిమితం కాకుండా ఆధునిక యంత్రాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ప్రజలకు మెరుగైన రోడ్లు, డ్రైనేజీలు, మౌలిక సదుపాయాలు అందించడమే మా లక్ష్యం" అని ఆయన పేర్కొన్నారు. నగరంలోని అన్ని డివిజన్లలో ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని, ప్రతి రూపాయి ప్రజలకు ఉపయోగపడే శాశ్వత అభివృద్ధి పనులుగా కనిపించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. అభివృద్ధికి ఆధునిక సాంకేతికత కొత్త వేగం " అజాక్స్" వంటి ఆధునిక యంత్రాల వినియోగం ద్వారా మానవ వనరులపై ఆధారపడటాన్ని తగ్గించడం, పనుల అమలులో వేగం పెంచడం, కాంక్రీట్ సరఫరాలో సమయాన్ని ఆదా చేయడం, నిర్మాణ ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించడం సాధ్యమవుతుందని మేయర్ తెలిపారు."అభివృద్ధిలో ఆలస్యానికి తావులేదు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకొని కరీంనగర్‌ను మెరుగైన మౌలిక వసతులతో కూడిన ఆధునిక నగరంగా తీర్చిదిద్దుతాం. 35వ డివిజన్‌లో ప్రారంభమైన ఈ విధానం నగర అభివృద్ధి పనుల్లో కొత్త వేగానికి నాంది కావాలి, " అని మేయర్ కొలగాని శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 35వ డివిజన్ కార్పొరేటర్ సాధవిని సుజాత శ్రీనివాస్, మున్సిపల్ అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.




# సిపిఐ ఆధ్వర్యంలో ప్రజా పోరుయాత్ర

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) ఆగస్టు 10**

సోమవారం మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలంలోని అంకుశం గ్రామపంచాయతీలో అంకుశం లింగదరి గూడ గోండు గూడ కన్నాల గ్రామపంచాయతీ లో కన్నాల ఎస్సీ కాలనీ లక్ష్మీపూర్ గ్రామాలలో తిరగడం జరిగినది ఈ జాతకు బెల్లంపల్లి నియోజకవర్గ కార్యదర్శి కామ్రేడ్ దాగం మల్లేష్, మరియు రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి మిట్టపల్లి వెంకటస్వామి, రాష్ట్ర సమితి సభ్యులు కామ్రేడ్ బొల్లం పూర్ణిమ, గార్లు హాజరై ఆగస్టు 6 నుండి 14 వరకు నియోజకవర్గంలో ఈరోజు 5వ రోజు పై గ్రామాలు తిరుగుతూ ప్రజలను చైతన్యం చేయడానికి దోహదపడుతుందని అన్నారు ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి సిపిఐ మండల కార్యదర్శి కామ్రేడ్ బొంతల లక్ష్మీనారాయణ,బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఆడపు రాజమౌళి,బి కే ఎం యు జాతీయ కౌన్సిల్ మెంబర్ అక్కపల్లి బాబు,జిల్లాకు సమితి సభ్యులు మేకల రాజేశం,రత్నం రాజం,రత్నం ఐలయ్య,దాసరి తిరుపతి గౌడ్,బెల్లంపల్లి పట్టణ సహాయ కార్యదర్శి బొల్లం తిలక్,అంబేద్కర్ రమణ, తదితరులు పాల్గొన్నారు.



# కార్మిక చట్టాల పరిరక్షణకై మరో పోరాటం

- టేకుమల్ల సమ్మయ్య ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి

**( వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు కరీంనగర్) ఆగస్టు 10**

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జాతీయ కార్మిక, రైతు సంఘాల పిలుపుమేరకు సోమవారం కరీంనగర్ లోని కమాన్ చౌరస్తా వద్ద ఏఐటియుసి, టియుసిఐ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రైతు, కార్మిక వ్యతిరేక చట్టాల కాపీలను దగ్ధం చేయడం జరిగిశీది. ఈ సందర్భంగా ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య, టియుసిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జిందం ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోయడ సృజన కుమార్ మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ , వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడానికి వాణిజ్య ఒప్పందాలను చేస్తుందని, దేశానికి వెన్నుముక రైతు అని చెప్పినటువంటి కేంద్రం నేడు రైతుకి గిట్టుబాటు ధర లేకుండా సబ్సిడీ రుణాలు ఇవ్వకుండా, విత్తనాలు అధిక రేట్లు పెంచుతూ, యూరియా రేట్లు రెట్టింపు చేస్తూ, ఆరు కాలం పంట పండించే రైతుకు గిట్టు గిట్టుబాటు ధర కల్పించకుండా మధ్య దళారీలు దోపిడీ చేస్తుంటే ప్రభుత్వం ఏం చేస్తుందని వారు ప్రశ్నించారు. జాతీయ ఉపాధి హామీ పథకం 100 రోజులు నుండి 200 రోజులకు పెంచాలని, రోజువారీ కూలీ 700 ఇవ్వాలని ఒకవైపు ఆందోళన చేస్తుంటే ఉన్న పథకాన్ని రద్దుచేసి రాంజీ పథకం పేరుతో ప్రభుత్వం కుట్ర చేస్తుందని దీనిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సవరణ 2025 చట్టం రద్దు చేయాలని, పంటకి గిట్టుబాటు ధర కల్పించాలని చట్టం చేయాలని, రుణమాఫీ, పంటల బీమా అమలు చేయాలని, నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలను తక్షణమే రద్దు చేయాలని లేకపోతే పెద్ద ఎత్తున దేశవ్యాప్త ఆందోళనకు పూనుకుంటామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్, సిపిఐ నగర సహాయక కార్యదర్శి పైడిపల్లి రాజు, ఏఐటీయూసీ నగర కార్యదర్శి కిమ్మసారపు నరసయ్య బొంతల ఎల్లయ్య, దాసరి అనిల్ టియుసి నాయకులు ఎస్ కమలాకర్ మునీధర్ శ్రీపతి ప్రసాదులు పాల్గొన్నారు.

# అక్రమంగా బంధించి పాలనను కొనసాగించలేరు

- అరెస్టు చేసిన వారందరిని విడుదల చేయాలి
- అఖిలభారత రైతుకూలీఈ సంఘం ఏఐకేఎంఎస్ ఎస్కేయం రాష్ట్ర నాయకులు జీ సక్రు

**( పగడాల.రామారావు. ప్రజా తీర్పు గార్ల మండల ప్రతినిధి ,)ఆగస్టు 10**



గార్ల. కేంద్ర ప్రభుత్వంభారత వ్యవసాయ రంగాన్ని దేశ విదేశా కార్పోరేట్ కంపెనీలకు కట్టబెట్టడాన్ని రద్దు చేయాలని పంటలకు మద్దతు ధరలను చెల్లించాలని నాలుగు లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలని సంయుక్త కిషన్ మోర్చా ఎస్కేయం ఆధ్వర్యంలో సోమవారరశీ నిరసనతెలియజేస్తున్న ఎస్కేయం అఖిలభారత రైతుకు లి సంఘం నాయకులను అరెస్టు చేయడం స్టేషన్లో బంధించడం మోడీ ప్రభుత్వ దివాలా కోరుతనానికి నిదర్శనమని అఖిలభారత రైతుకుల్లి సంఘం కేఐకేఎంఎస్ రాష్ట్ర నాయకులు జీ సక్రు అన్నారు భారతదేశంలోని రైతాంగాన్ని కార్మిక రంగాన్ని కాపాడుకోవడం కోసం మాత్రమే ఈ ఉద్యమం తప్ప మరొకటి కాదని ఉద్యమాన్ని అణిచివేయడం కోసం రైతాంగ వ్యతిరేక విధానాలను అవలంబిస్తే ప్రజలు ఊరుకోరని ఆయన అన్నారు ఇప్పటికైనా మోడీ ప్రభుత్వం మేలుకొని ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేయాలని లేనియెడల ప్రజా ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని తక్షణం అరెస్టు చేసిన ఎస్కేయం అఖిల భారత రైతు సంఘం నాయకులను కార్మిక సంఘ నాయకులను మహిళా సంఘ నాయకుల విద్యార్థి సంఘ నాయకులను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# జాతీయ రైతు పరిరక్షణ సమితి ప్రధాన కార్యదర్శిగా రవీందర్‌రెడ్డి

**రామడుగు, ఆగస్టు 10 (ప్రజాతీర్పు ప్రతినిధి)**



జాతీయ రైతు పరిరక్షణ సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గుజ్జుల రవీందర్‌రెడ్డిని నియమించారు. కరీంనగర్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో సమితి జాతీయ అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బిరెడ్డి కరుణాకర్‌రెడ్డి ఆయనను నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు. గుజ్జుల రవీందర్‌రెడ్డికి గతంలో సింగిల్ విండో చైర్మన్‌గా, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్‌గా పనిచేసిన అనుభవంతో పాటు ఉత్తమ రైతుగా గుర్తింపు ఉంది. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన ఆయనకు రైతుల సమస్యలపై అవగాహన, అనుభవం ఉందని సమితి ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్పగించిన జాతీయ అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బిరెడ్డి కరుణాకర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన పదవికి తగిన న్యాయం చేస్తానని, రైతుల సమస్యలతో పాటు ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతానని పేర్కొన్నారు.









# ప్రజా తీర్పు కథనానికి స్పందించినఅధికారులు

- సొంత ఖర్చులతో ఆసుపత్రికి రూపురేఖలు మార్చిన హెల్త్ ఆఫీసర్
- భానోజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎం పి హెచ్ ఇ ఓ యాకయ్య స్వామి ఉదారత

**నర్సంపేట రూరల్,ఆగస్టు 10 , ప్రజా తీర్పు ప్రతినిధి :**

ప్రభుత్వ ఉద్యోగం అంటే కేవలంవిధులు నిర్వహించడమే కాదని, సమాజం పట్ల బాధ్యతను కూడా చాటాలని నిరూపించారు భానోజీపేట గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎం పి హెచ్ ఇ ఓ యాకయ్య స్వామి. తొవ్వ స్వాగతందినపత్రికలో ఆసుపత్రి సమస్యలపై వచ్చినకథనానికి తక్షణమే స్పందించి ఆయన, సొంత నిధులతో ఆసుపత్రి రూపురేఖలను మార్చి వేసి, స్థానికుల ప్రశంసలు అందుకుంటున్నారు.సొంత డబ్బులతో మౌలిక వసతులుఆసుపత్రికి వచ్చే రోగుల ఇబ్బందులను గమనించిన ఎం పి హెచ్ ఈ ఓ తన సొంత ఖర్చులతో ఆసుపత్రిప్రాంగణంలోతాగునీటి సంపు, రోగులు, సిబ్బంది దాహార్తిని తీర్చేందుకు నీటి సంపు నిర్మాణం.మరుగుదొడ్ల నీటి వసతి, ఆసుపత్రికి వచ్చే వారి సౌకర్యార్థం నీటి సౌకర్యాన్ని పునరుద్ధరించడం.?నామఫలకం (సైన్ బోర్డు)ప్రధాన రహదారి నుండి ఆసుపత్రికి వెళ్లే దారి సులభంగా తెలిపేలా నూతన బోర్డు ఏర్పాటు.

**ప్రజా తీర్పుకథనానికి స్పందన గ్రామస్తుల ప్రశంసలు**

ఇటీవల ఆసుపత్రిలోని మౌలిక వసతుల లేమిపై దినపత్రికలో ప్రచురితమైన కథనానికి యాకయ్య సానుకూలంగాస్పందించారు. కేవలం అధికారుల నిధుల కోసం వేచి చూడకుండా, తక్షణ చర్యగా తన సొంత నిధులతో ఈ పనులన్నీ పూర్తి చేయించడం విశేషం.యాకయ్య సేవా నిరతిపై గ్రామస్తులు, రోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రి వ్యవస్థపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచేలా వ్యవహరించిన ఆయనను తోటి సిబ్బంది, స్థానిక ప్రజలుకొనియాడుతున్నారు.



# ఘనంగా నెక్కొండ మార్కెట్ చైర్మన్ రావుల హరిష్ రెడ్డి జన్మదిన వేడుకలు

- హజరై శుభాకాంక్షలు తెలియజేసిన టిపిసిసి సభ్యులు రంజిత్ రెడ్డి

**నెక్కొండ, ఆగస్టు 10, ప్రజా తీర్పు ప్రతినిధి:**

స్థానిక =డీ గెస్ట్ హౌస్ లో ఈరోజు నెక్కొండ మార్కెట్ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రావుల హరీష్ రెడ్డి జన్మదిన వేడుకలకుహాజరైశు భాకాంక్షలు తెలియచేసిన టీపీసీసీ సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి,నెక్కొండ సర్పంచ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్ ,కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బక్కి అశోక్ ,నెక్కొండ మండల అధ్యక్షులు లావుడ్యా తిరుమల్ ,నెక్కొండ ప్రాథమిక సొసైటీ సంఘ అధ్యక్షుడు చల్ల శ్రీపాల్ రెడ్డి, సూరిపల్లి సొసైటీ చైర్మన్ మాదాటి శ్రీనివాస్, రెడ్లవాడ సొసైటీ చైర్మన్ ఆవుల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి కుసుమ చెన్నకేశవులు , వర్కింగ్ ప్రెసిడెంట్ కొనిజేటి బిక్షపతి,నెక్కొండరామాలయం కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్ రెడ్డి, సోసైటీ డైరెక్టర్ కేవీ సుబ్బారెడ్డి ,కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు గరికపాటి హనుమంతరావు ,మాజీ నెక్కొండ సొసైటీ అధ్యక్షుడు కొమ్మారెడ్డి రవీందర్ రెడ్డి , ఓబీసీ జిల్లాప్రధానకార్యదర్శి రాచకొండ రఘు, మార్కెట్ డైరెక్టర్ రావుల మైపాల్ రెడ్డి, రామాలయం కమిటీ డైరెక్టర్ గుంటుపల్లి ప్రభాకర్ రావు ,రావుల భాస్కర్ రెడ్డి, బంజరు పెల్లి సర్పంచ్ భూక్య రమేష్ రాథోడ్ మాజీ విద్యా కమిటీ చైర్మన్ గరికపాటి కృష్ణారావు నెక్కొండ గ్రామ వార్డు సభ్యులు ముద్రబోయిన శ్రీకాంత్ అమీన్ పేట మాజీ సర్పంచ్ చిలుపూరి యాకయ్య నెక్కొండ తండా గ్రామపార్టీ అధ్యక్షులు బానోత్ శ్రీకాంత్ నాదేండ్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# ఆపదలో అండగా నిలిచిన తోట సత్యం

**రామడుగు, ఆగస్టు 10 (ప్రజాతీర్పు ప్రతినిధి)**

ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబానికి అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్నారు తోట సత్యం. రామడుగు మండల కేంద్రానికి చెందిన జిట్టవేణి భూలక్ష్మి, మమత కుటుంబ సభ్యులు అనారోగ్య సమస్యలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న తోట సత్యం వారికి ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా వారికి రూ.20 వేల ఆర్థిక సహాయం అందించడంతో పాటు, ప్రతి నెలా రూ.2 వేల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తూ వారికి అండగా నిలుస్తానని తోట సత్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగి శేఖర్, సముద్రాల శ్రీనివాస్, ముదిరాజ్ కుల పెద్దలు రాగం లచ్చయ్య, జిట్టవేణి అంజిబాబు, ఉత్తం కనకయ్య, జిట్టవేణి రమేష్, మామిడి రాజు కుమార్, మామిడి శ్రవణ్, కారుపాకల నరేష్, రాగం రవి, మామిడి తిరుపతి, మన్నె మధు, కీర్తి కుమార్, జిట్టవేణి అంజి, పాక కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

# ముత్తి తండా, మర్రిగూడెం గ్రామాలలో నూతన శాఖల ఏర్పాటు

- పార్టీ జెండా ఆవిష్కరణ చేసిన జిల్లా కార్యదర్శి బి. విజయ సారథి

**(పగడాల.రామారావు. ప్రజా తీర్పు గార్ల మండల ప్రతినిధి )ఆగస్టు 10**



గార్ల:- స్థానిక మండలంలో ఇటీవల కాలంలో వివిధ పార్టీల నుండి సిపిఐ పార్టీలో చేరిన సందర్భంగా స్థానిక మండల పరిధి ముత్తి తండా ,మర్రిగూడెం గ్రామాలలో సోమవారంపార్టీ జెండా ఆవిష్కరించిన జిల్లా కార్యదర్శి బి విజయ సారధి. మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలపై ఈనెల 6 నుండి 14 వరకు దేశవ్యాప్తంగా పాదయాత్రలు, ప్రచార యాత్రలు జరుగుతున్నాయి. ఈ ప్రచార యాత్రలలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా కోరారు. నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా అభివృద్ధి ఉపాధి సంక్షేమం సుపరిపాలన మరియు మెరుగైన భవిష్యత్తును అందిస్తామని వాగ్దానం చేసింది కానీ దానికి బదులుగా దేశంలో నేడు పెరుగుతున్న నిరుద్యోగం భరించలేని ద్రవయోల్బణం ధరల పెరుగుదల విస్తరిస్తున్న అసమానతలు బలహీనపడుతున్న గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కుషించుకుపోతున్న ప్రజాస్వామ్యం మరియు పెరుగుతున్న సామాజిక ఉద్రిక్తలను ఎదుర్కొంటుంది అయినప్పటికీ మోడీ ప్రభుత్వం నుండి ఈ ప్రశ్నలకు సమాధానాలు కావాలని కోరినప్పుడల్లా ఈ చర్చను ఇతర అంశాల వైపునకు మళ్లిస్తున్నారు సామాన్య పౌరుల రోజువారి సమస్యలను పరిష్కరించడానికి బదులుగా బిజెపి మరియు ఆర్ఎస్ఎస్ పదేపదే మతపరమైన దృవీకరణ మానసిక విజ్ఞప్తులు మరియు సృష్టించబడిన వివాదాల వైపు మొగ్గు చూపుతున్నాయి జవాబుతారితనం నుండి తప్పించుకోవడానికి మతాన్ని వాడుకుంటున్నారు అని అన్నారు. యువత పోటీ పరీక్షల కోసం ఏళ్ల తరబడి సన్నద్ధమవుతుంటే నియామకాలు ఆలస్యం కావడం రద్దు కావడం లేదా వరుస పేపర్ లీకేజీల వల్ల పక్క దారి పట్టడం వంటివి జరుగుతున్నాయి ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలు భర్తీ కాకుండా అలాగే ఉండిపోతుంటే శాశ్వత సురక్షితమైన ఉద్యోగాల స్థానంలో ఒప్పంద కాంట్రాక్టు ఉద్యోగాలు వచ్చి చేరుతున్నాయి చదువుకున్న యువత చేతిలో డిగ్రీలు ఉన్నప్పటికీ వారి ఆకాంక్షలను తగ్గ అవకాశాలు లభించకపోవడంతో ఒక పరీక్ష నుండి మరో పరీక్షకు తిరుగుతూనే ఉన్నారు చదువు తమ పిల్లల భవిష్యత్తును సురక్షితం చేస్తుందని ఆశతో కుటుంబాలు తమ పొదుపు మొత్తాన్ని పెట్టుబడిగా పెడుతున్నాయి కానీ దానికి బదులుగా లెక్క లేనంత మంది భారతీయ యువత తీవ్ర నిరాశకు గురవుతూ నిరుద్యోగ మారుతూ తమ రేపటి భవిష్యత్తు గురించి నీ స్థితితో మిగిలిపోతున్నారు బిజెపి ప్రభుత్వ అతిపెద్ద వైఫల్యాల్లో ఉద్యోగం ఒకటి అనే నిజాన్ని ఎంతటి ప్రచారం కూడా దాచలేని పరిస్థితి దేశంలో నెలకొంది అని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని లేనియెడల దశల వారి ఆందోళన పోరాటాలను ఉధృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కట్టెబోయిన శ్రీనివాస్, పార్టీ మండల కార్యదర్శి జంపాల వెంకన్న, నాయకులు భూక్య హరినాయక్, రాగం రమేష్, మెదరమెట్ల గిరిప్రసాద్, కృష్ణమూర్తి, మాగంలోకేష్, భూక్య పుల్ సింగ్, మంగీలాల్, లక్ష్మి, సొమ్లు, శ్రీను తదితరులు పాల్గొన్నారు. విప్లవాభివందనములతో... జంపాల వెంకన్న మండల కార్యదర్శి గార్ల.



# రాజేందర్ సింగ్ జన్మదినం సందర్భంగా మహా అన్నదానం

- బెల్లంపల్లి పట్టణంలో పలుచోట్ల ఆహార పంపిణీ
- కృతజ్ఞతలు వ్యక్తం చేసిన అన్నార్తులు, పేదలు, యాచకులు

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) ఆగస్టు 10**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి కళాశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ డి.ఎస్.ఆర్ రాజేందర్ సింగ్ జన్మదినం సందర్భంగా బెల్లంపల్లిలో బాయిజమ్మ సాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో రాజేందర్ సింగ్ కుటుంబీకులు రామ్ సింగ్, సరోజిని, సునీత, రష్మీ, రచన, రఘువీర్ సింగ్, అరుణ, రాజ్ కుమార్, సుమన్, రుద్రాన్స్ రాకేష్, నేహా, రాధిక, రూపేష్, ఆద్య గార్లు ఇచ్చిన ఆర్థిక సహకారంతో సోమవారం మధ్యాహ్నం సాయి భోజన్ అన్నదానం, పండ్లు పంచినట్లు సనాతన ధర్మ బాయిజమ్మ సాయి భక్తి ప్రచార ధార్మిక సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు ప్రముఖ విద్యావేత్తలు డాక్టర్ కాంపల్లి శంకర్-రాజేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు చోట్ల యాచకులకు,మానసిక వికలాంగులకు, వృద్ధులకు, అనాథలకు, రోగులకు, పేదవారికి, అన్నార్తులకు అన్నదానం, పండ్లు పంచారు.

**ఉన్నత విద్యావేత్త.. ఉన్నతాధికారి**

డాక్టర్ డి ఎస్ ఆర్ రాజేందర్ సింగ్ సార్ తెలంగాణ కళాశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్గా ప్రస్తుతం సేవలు అందిస్తున్నారు. ఆయన ఉన్నత విద్యావేత్తగాను, ఉన్నతాధికారి హోదాలోనూ అన్ని వర్గాల వారికి అండగా ఉంటున్నారు. ముఖ్యంగా పేద విద్యార్థులకు ఎంతో సహాయకారిగా ఉంటున్నారు. అలాగే కళాశాల విద్యాశాఖ పరిధిలో పనిచేసే అన్ని రకాల అధ్యాపకులకు అన్ని రకాలుగా సహాయ, సహకారాలు అందిస్తున్నారు. అలాంటి గొప్ప వ్యక్తి పేరు మీద అన్నదానం చేయడం ఆనందంగా ఉందని భాయిజమ్మ సాయి సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ కాంపల్లి శంకర్ రాజేశ్వరి ఆనందం వ్యక్తం చేశారు.

**అన్నదానం చేద్దాం.. చేయూతనిద్దాం**

సేవ ట్రస్ట్ ద్వారా ఆకలితో ఉన్నవారిని అతిథి సత్కారంతో ఆదరిద్దాం-అన్నదానంతో తృప్తి పరుద్దాం సేవే లక్ష్యం సేవే మార్గంగా, మానవసేవే మాధవసేవ అనే ఉద్దేశంతో ట్రస్ట్ కొనసాగుతుందని త్రవిద్య, శ్రవిద్య, త్రయాక్షర్ గార్లు తెలియజేస్తూ ఈ కార్యక్రమంలో సేవా ట్రస్ట్ మేనేజర్ బొద్దున సతీష్ ట్రస్ట్ సభ్యులు, సేవకులు కాంపల్లి త్రవిద్య, జంగం రశ్విత, సింగతి అక్షర, పెద్దపల్లి లహస్య, రూపం కుమారి, దేవరకొండ వర్షిని, పాల్గొన్నారు. ట్రస్ట్ మేనేజర్- 8106550532 ట్రస్ట్ ఫౌండర్స్-9959269975 9949041595అన్నదానం చేయదలచిన దాతలు పై నెంబర్లలో సంప్రదించాలని ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు.




**బిజెపి ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు నిరసనగా.. మంథనిలో సిఐటియు రైతు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జైలు భరో**

**మంథని, ఆగస్టు-10 (ప్రజాతీర్పు)**

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం మంథని పట్టణంలో జైల్భరో కార్యక్రమం నిర్వహించారు. సీఐటియు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ చేపట్టి, అనంతరం మంథని పట్టణంలోని అంబేద్కర్ ప్రధాన చౌరస్తాలో అరగంట పాటు రాస్తారోకో నిర్వహించారు. రాస్తారోకో నిర్వహిస్తున్న నాయకులు బూడిద గణేష్, ఆర్ల సందీప్, వనజారాణిలను మంథని పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సీఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ.. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలకు నష్టం కలిగించే విధానాలను తీసుకువస్తోందని ఆరోపించారు. భారతదేశ స్వాతంత్ర్య క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో మంథనిలో జైల్భరో కార్యక్రమం నిర్వహించామని, కార్మికులు, కష్టజీవులు తమ సమస్యల పరిష్కారం కోసం రోడ్డెక్కి పోరాటం చేస్తున్నారని తెలిపారు. స్వాతంత్ర్య ఉద్యమ పోరాట స్ఫూర్తితో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిందని, ఈ నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో గత 25 సంవత్సరాలుగా కొనసాగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని తొలగించి వి.బి. జిరాంజీ పథకాన్ని తీసుకురావడం ద్వారా గ్రామీణ నిరుపేదలకు తీరని అన్యాయం చేశారని విమర్శించారు. విద్యుత్ సవరణ బిల్లును తీసుకువచ్చి పేద ప్రజలపై విద్యుత్ భారాలు మోపుతున్నారని, రైతులకు స్మార్ట్ మీటర్ల పేరుతో ఉచిత కరెంటు పథకానికి స్వస్తి పలికే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. విత్తన చట్టాన్ని తీసుకువచ్చి వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. అంత్యోదయ పథకం ద్వారా నిరుపేద కుటుంబానికి 35 కిలోల బియ్యం లేదా గోధుమలు అందించే విధానాన్ని రద్దు చేసి, ఒక్కో వ్యక్తికి 7 కిలోలు మాత్రమే ఇవ్వాలని ఆహార భద్రత చట్టంలో కూడా సవరణలు తీసుకువస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కళ్లు తెరిచి కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను మానుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజా పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం పెద్దపల్లి జిల్లా కార్యదర్శి బూడిద గణేష్, సీఐటియు జిల్లా కమిటీ సభ్యుడు డి.కొమురయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆర్ల సందీప్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వేల్పుల సురేష్, జిల్లా నాయకులు బాబు రవి, ఉప్పు రమేష్, సీఐటియు నాయకులు కుమార్, పాషా, సీఐటియు నాయకురాళ్లు సులోచన, శ్యామల, సుగుణ, శోభ, హరిత, మున్సిపల్ కార్మిక నాయకులు చందు, గట్టయ్య, బూడిద అశోక్, మల్లేష్, ఎస్ఎఫ్ఐ మంథని మండల అధ్యక్షుడు బందెల రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# చదువుల తల్లికి చేయూత

- పదో తరగతిలో 538 మార్కులతో మండల ప్రథమ స్థానం
- ఇంటర్ చదువులకు రూ.25 వేల ఆర్థిక సహాయం

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఆగస్టు 10 (ప్రజా తీర్పు)**



టేకులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని సాగంటి హర్షితకు తెలంగాణ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, విద్యానగర్ కొత్తగూడెం ఆధ్వర్యంలో విద్యాసహాయం అందించారు. 2025-26 విద్యాసంవత్సరంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 538 మార్కులు సాధించి మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన హర్షిత ఇంటర్ చదువును కొనసాగించేందుకు దాతల సహకారంతో రూ.25 వేల నగదును అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు కొల్లు నాగేశ్వరరావు మాట్లాడుతూ హర్షిత విషయం తమ దృష్టికి వచ్చిన వెంటనే దాతలను సంప్రదించగా, వారు స్పందించి విద్యాదానం గొప్పదనే భావనతో సహాయం అందించారని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలకు తమ సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. అసోసియేషన్ కార్యదర్శి సురేష్ కుమార్ మాట్లాడుతూ హర్షిత భవిష్యత్తు ఉజ్వలంగా కనిపిస్తోందని, ఉన్నత చదువులు చదివి మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. సభ్యుడు పాండురంగారావు హర్షితకు సరస్వతి దేవి ప్రతిమను అందజేశారు. అసోసియేషన్ తరఫున కాలేజీ బ్యాగ్, నోట్బుక్స్, పెన్నులు అందించి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి కోనేరు పూర్ణచంద్రరావు, తూము వెంకట నగేష్, సంధ్య దంపతులు (అమెరికా), దండమూడి రవీంద్ర, అక్కినేని మురళీకృష్ణ, సామినేని భాస్కర్రావు దాతలుగా సహకరించారు. సభ్యులు సోందుబాబు, రాజేంద్రప్రసాద్, సీతారామశాస్త్రి, ధర్మారావు, మోహన్లాల్, శివరామకృష్ణ, కేశవరావు, సామ్యూల్, రషీద్, రామిరెడ్డి, సత్యానందం, ప్రవీణ్కుమార్, తోట సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# టేకులపల్లిలో ప్రజా చైతన్యయాత్ర కేంద్ర ప్రభుత్వ విధానాలపై సి. పి .ఐ పార్టీ ఆగ్రహం

- సంపూర్ణమద్దతుతెలిపినఇల్లందు ఎమ్మెల్యేకోరం కనకయ్య

**(పొనకంటి ఉపేందర్ రావు ప్రజా తీర్పు) ఆగస్టు 10**



భద్రాద్రి కొత్తగూడెం :జిల్లాలో సి పి ఐ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రజా చైతన్య యాత్ర 5వ రోజు టేకులపల్లి మండల కేంద్రం బోడు సెంటర్ కు చేరుకుంది. ఆగస్టు 6న పినపాక నియోజకవర్గం బయ్యారం నుండి ప్రారంభమైన ఈ యాత్ర టేకులపల్లిలో భారీ బహిరంగ సభతో కీలక మలుపు తిరిగింది. ఈ సభ పూర్తిగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాగింది.ముఖ్యఅతిథిగా హాజరైన సి పి ఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్.కె షాబీర్ పాషా మాట్లాడుతూ టేకులపల్లి ప్రాంత అభివృద్ధిని కేంద్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. టేకులపల్లి ప్రాంతంలో నూతన బొగ్గు భూగర్భ గనులు ఏర్పాటు చేయాలని, స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పోడు సాగుదారులపై జరుగుతున్న దాడులు దౌర్జన్యాలను ఖండిస్తూ వాటిని ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రలు జరుగుతున్నాయని, గ్రామీణ ప్రజలకు కనీస మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఈ యాత్ర ఆగస్టు 14 వరకు కొనసాగుతుందని, టేకులపల్లి నుండి సీతారాంపురం, కారుకొండ, హేమచంద్రపురం, ఎదురుగడ్డ మీదుగా కొత్తగూడెం పట్టణంలో ముగుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య సంపూర్ణ మద్దతు తెలుపుతూ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్ డి ఏ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేంద్రం అధికారంలోకి వచ్చిన తర్వాత స్పష్టమైన రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని ఆరోపించారు. వ్యవసాయ రంగాన్ని కార్పోరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు వాణిజ్య ఒప్పందాలు చేస్తుందని విమర్శించారు. దేశానికి వెన్నెముక రైతు" అని చెప్పే కేంద్రం నేడు రైతుకు గిట్టుబాటు ధర లేకుండా చేస్తుందని, సబ్సిడీ రుణాలు ఇవ్వడం లేదని, విత్తనాల ధరలు విపరీతంగా పెంచుతుందని, యూరియా రేట్లు రెట్టింపు చేస్తుందని మండిపడ్డారు. ఆరుకాలం కష్టపడి పంట పండించే రైతుకు గిట్టుబాటు ధర కల్పించకుండా మధ్య దళారీలు దోపిడి చేస్తుంటే ప్రభుత్వం ఏం చేస్తుందని ప్రశ్నించారు. పేద ప్రజలకు, విద్యార్థులకు, అన్ని వర్గాల ప్రజలకు కేంద్రం అన్యాయం చేస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. టేకులపల్లి నుండి ఈ గళం ఢిల్లీ వరకు వినిపిస్తుందని, కేంద్రం దిగి వచ్చే వరకు పోరాడతామని స్పష్టం చేశారు.ఈ సభలో కొత్తగూడెం మున్సిపల్ మేయర్ మూడు గణేష్, యాదవ సంఘం రాష్ట్ర నాయకులు మచ్చ శ్రీనివాస్,సి పి ఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎస్.పుల్లారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాస్, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీ కుమారి, టేకులపల్లి మండల కార్యదర్శి గూగులోత్ రామ్ చందర్, సహాయ కార్యదర్శి నాగార్జున చారి, దేగల రమేష్, మహిళా సంఘం అధ్యక్షురాలు గూగులోత్ సోనీ, కార్యదర్శి జయమ్మ, మండల నాయకులు రవీందర్, లక్ష్మణ్, మధు, నరేందర్, యువరాజు, శ్యాం బాబు, లాలు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. సభకు టేకులపల్లి మండల ప్రజలు, రైతులు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున తరలి వచ్చి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని, పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, గిరిజనుల హక్కులు కాపాడాలని, బొగ్గు గనుల్లో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



## ఉద్రిక్తతల నడుమ దివంగత నేత శ్రీ పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం

**నర్సంపేట టౌన్ ఆగస్టు 10 ప్రజా తీర్పు**

ప్రజా సేవ చేసిన దివంగత నేత పెద్ది సుదర్శన్‌రెడ్డి స్మారకంగా విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు నిర్మించినం పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహ ఆవిష్కరణ గద్దె కూల్చివేయడం దుర్మార్గం విగ్రహ ఆవిష్కరణను అడ్డుకోవడం ప్రయత్నించిన చివరికి గద్దెను కట్టి పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహం ఆవిష్కరణ ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు..



## దేశభక్తిని చాటుతూ 'హర్ ఘర్ తిరంగా'

- ఇంటిపై జాతీయ జెండాను ఆవిష్కరించిన నల్ల మనోహర్‌రెడ్డి

**పెద్దపల్లి ప్రతినిధి, ఆగస్టు 10,( ప్రజా తీర్పు):**

దేశవ్యాప్తంగా బీజేపీ నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా--తిరంగా యాత్ర' కార్యక్రమంలో భాగంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నల్ల మనోహర్‌రెడ్డి హైదరాబాద్‌లోని తన నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేశభక్తిని చాటుతూ జాతీయ జెండాకు గౌరవం తెలిపారు. 'జాతీయ జెండా మన గౌరవం.. మన దేశం మన గర్వం' అనే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ దేశభక్తి భావాన్ని పెంపొందించుకోవాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.




## కార్మిక, రైతు హక్కులపై కేంద్రం దాడి

- కార్పొరేట్ల సేవలో మోదీ ప్రభుత్వం.. రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జైల్‌భరో

**కొత్తగూడెం, ఆగస్టు 10 (ప్రజా తీర్పు)**

కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికుల హక్కులపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీవ్రంగా దాడి చేస్తోందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్‌రావు, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి ముత్యాల విశ్వనాథం, అఖిలభారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర నాయకులు కెచ్చల రంగారెడ్డి, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి చంద్రారెడ్డి, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కే.బ్రహ్మాచారి తదితరులు ఆరోపించారు. కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం కొత్తగూడెం రైల్వే స్టేషన్ సెంటర్‌లో జైల్‌భరో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి నష్టం కలిగించే వ్యవసాయ ఒప్పందాలను రద్దు చేయాలని, కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేసి పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. దేశంలోని బొగ్గు బ్లాకులు, అటవీ సంపద, రైల్వేలు, రోడ్లు తదితర ప్రభుత్వ రంగ సంస్థలను కొద్దిమంది కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తున్నారని ఆరోపించారు. గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని, బీబీజీ రాంజీ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించేలా చట్టం చేయాలని, కార్మికులకు నెలకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని కోరారు. కార్పొరేట్ అనుకూల విధానాలను విడనాడాలని, లేదంటే మోదీ ప్రభుత్వం గద్దె దిగాలని నినాదాలు చేశారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెంపుతో సామాన్య ప్రజలపై భారాన్ని మోపుతున్నారని నాయకులు విమర్శించారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికుల హక్కుల కోసం క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. భారీగా అరెస్టులు కొత్తగూడెం రైల్వే స్టేషన్ సెంటర్‌లో వందలాది మంది రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు రహదారిపై బైఠాయించడంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో పోలీసులు ఆందోళనకారులను, సంఘాల నాయకులను అరెస్టు చేసి త్రీటౌన్, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్లకు తరలించారు. కార్యక్రమంలో మచ్చ వెంకటేశ్వర్లు, నారాటి ప్రసాద్, సీతారామయ్య, గోపాలరావు, నాగభూషణం, అన్నవరపు సత్యనారాయణ, అమర్లపూడి రాము, మధు, లిక్కి బాలరాజు, భూక్య రమేష్, దొడ్డ రవి, సత్య, కొండబోయి వెంకటేశ్వర్లు, కోబల్, కున్సోత్ ధర్మ, వీర్ల రమేష్, తిరుపతిరావు, వెంకట్రావు, తులసిరామ్, జమలయ్య, బుర్ర వెంకన్న, కల్తి వెంకటేశ్వర్లు, కుమార్, సంజీవ్, ప్రసాద్, ఆదిలక్ష్మి, మంగమ్మ, ఉమ, జ్యోతి, లక్ష్మి, ఇందిర, పద్మ, రజిత తదితరులు పాల్గొన్నారు.



## పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి

- 10 మంది అదుపులో, రూ.83,010 నగదు, 52 పేకముక్కలు, 8 సెల్‌ఫోన్లు స్వాధీనం

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) ఆగస్టు 10**

మంచిర్యాల జోన్ నెన్నెల పోలీస్ స్టేషన్ పరిధిలోని మన్నెగూడెం గ్రామ శివారులో డబ్బులు పందెంగా పెట్టి పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారంతో రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి నిర్వహించారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ శ్రీనివాస్ నేతృత్వంలో ఎస్‌ఐలు రమేష్, లచ్చన్న ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడిలో పేకాట ఆడుతున్న 10 మందిని అదుపులోకి తీసుకుని, రూ.83,010 నగదు, 52 పేకముక్కలు,8 మొబైల్ ఫోన్లు,ఒక హీరో గ్లామర్ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. పేకాట నిర్వహించినట్లు గుర్తించిన ఆర్గనైజర్ రాళ్లపేట శ్రీకాంత్,తో పాటు శ్రీను, రాజ్‌కుమార్, పరారీలో ఉన్నారు.వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. స్వాధీనం చేసుకున్న నగదు, పేకముక్కలు, మొబైల్ ఫోన్లు,ద్విచక్ర వాహనంతో పాటు అదుపులోకి తీసుకున్న వ్యక్తులను తదుపరి చర్యల కోసం నెన్నెల పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు.

## వాగు ఉధృతి.. రైతుల గతి ఇదే..

**మహ్మద్‌నగర్/ ఆగస్టు 10( ప్రజా తీర్పు):**



మహ్మద్‌నగర్ మండలంలోని సింగీతం గ్రామ శివారులో ప్రవహిస్తున్న వాగు రైతులకు తీవ్ర ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. వాగు అవతల సుమారు 500 పంట పొలాలు ఉండటంతో వ్యవసాయ పనుల కోసం రైతులు ప్రతిరోజూ వాగు దాటాల్సి వస్తోంది. ప్రస్తుతం వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని తెప్పపై బిక్కుబిక్కుమంటూ ప్రయాణిస్తున్నారు. వంతెన నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.80 కోట్లతో పనులు చేపట్టినా ఇప్పటికీ పూర్తికాలేదు. వర్షాకాలంలో వాగు మరింత ఉధృతంగా మారితే పరిస్థితి ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వంతెన నిర్మాణ పనులను సత్వరం పూర్తిచేసి తమ కష్టాలు తీర్చాలని కోరుతున్నారు.

## గురుకులాల్లో తల్లిదండ్రుల.. విద్యార్థుల పట్ల వేధింపులు ఆందోళనకరం..

- బాధ్యులైన ప్రిన్సిపాల్స్.. ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకోవాలి..
- టిఇపిఏ వ్యవస్థాపకుడు దార మధు

**మంథని, ఆగస్టు-10 (ప్రజాతీర్పు)**



రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, జనరల్ గురుకుల విద్యాసంస్థల్లో కొంతమంది ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు తమ విధులను విస్మరించి పాఠశాలలను సొంత జాగీర్లుగా భావిస్తూ వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయని తెలంగాణ ఎడ్యుకేషనల్ పేరెంట్స్ అసోసియేషన్ (టిఇపిఏ) వ్యవస్థాపకుడు దార మధు అన్నారు. తల్లిదండ్రులు మరియు విద్యార్థులతో అమర్యాదగా ప్రవర్తించడం, అనవసరంగా ఇబ్బందులకు గురిచేయడం వంటి ఘటనలు చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. విద్యార్థుల సంక్షేమం, నాణ్యమైన విద్య అందించాల్సిన బాధ్యత కలిగిన అధికారులు, ఉపాధ్యాయులు తమ అధికారాలను దుర్వినియోగం చేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని దార మధు కోరారు. గురుకులాల్లో వేధింపులు, నిర్లక్ష్యం, దురుసు ప్రవర్తనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, తల్లిదండ్రులు, విద్యార్థులు చేస్తున్న ఫిర్యాదులను నిష్పక్షపాతంగా విచారించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులను, తల్లిదండ్రులను వేధిస్తున్నట్లు విచారణలో తేలిన ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులపై శాఖాపరమైన విచారణ నిర్వహించి, అవసరమైతే సస్పెన్షన్, ఉద్యోగాల నుంచి తొలగింపు సహా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. గురుకుల విద్యాసంస్థలు విద్యార్థుల అభివృద్ధికి కేంద్రాలుగా నిలవాలే తప్ప భయాందోళనలకు నిలయాలుగా మారకూడదన్నారు. విద్యార్థుల, తల్లిదండ్రుల సమస్యలను గౌరవంగా విని పరిష్కరించే విధంగా గురుకులాల్లో బాధ్యతాయుతమైన వాతావరణాన్ని కల్పించాలని దార మధు కోరారు.


# పోలీస్ గ్రీవెన్స్ డేలో బాధితుల పిర్యాదులను పరిశీలించిన జిల్లా ఎస్పి నరసింహ ఐపీఎస్

**(అనంతుల శ్రీనివాస్ గౌడ్, ప్రజా తీర్పు సూర్యాపేట జిల్లా ప్రతినిధి) ఆగస్టు 10**



సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా ఎస్పి నరసింహ ఐపీఎస్ పిర్యాదుదారుల నుండి వినతులు స్వీకరించారు. జిల్లా పరిధిలోని వివిధ మండలాల నుంచి వచ్చిన బాధితులు వివిధ సమస్యలపై ఫిర్యాదులకు సంబంధించి బాధితులు ఎస్పి గారిని ప్రత్యక్షంగా కలిసి వినతులు సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్పి గారు ప్రతి ఒక్క బాధితుడి సమస్యను విని, వాటి పరిష్కారం కోసం తక్షణ చర్యలు తీసుకునేలా సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి అవసరమైన సూచనలు జారీ చేశారు. ప్రజలకు త్వరితగతిన న్యాయం అందేలా, వారి సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలనే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే, ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని ఎస్పి గారు తెలిపారు. చట్టబద్ధమైన విధానంలో ప్రతి ఫిర్యాదును పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## భారంగా ఇథనాల్ ఉత్పత్తి




దేశంలో శిలాజ ఇంధనాల దిగుమతులను తగ్గించేందుకు ఇథనాల్ కీలక పరిష్కారంగా మారుతున్నది. ఈ20 పెట్రోల్ వాడకం సాధారణ మవుతుండంతో ఇథనాల్‌కు డిమాండ్ భారీగా పెరిగింది. ఇథనాల్ తయారీకి ప్రధాన ముడి పదార్థాలలో ముఖ్యమైనది చెరుకు. నీతి ఆయోగ్ ఇథనాల్ రోడ్ మ్యాప్ ప్రకారం చెరుకు ఆధారిత ఇథనాల్ తయారీలో మొత్తం నీటి వినియో గం ఒక లీటర్ ఇథనాల్‌కు 3,000 లీటర్లుగా ఉంది. ఇందులో అత్యధిక భాగం ఇథనాల్ ఫ్యాక్టరీల లోపల కాకుండా, నేరుగా చెరకు సాగుకే వినియోగమవుతున్నది. దేశంలో వ్యవసాయ రంగం ఇప్పటికే నీటి వనరులపై అపారమైన భారాన్ని మోపుతున్నది. ఇటువంటి తరుణంలో ఇథనాల్ ఉత్పత్తిలో నీటి వినియోగంపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ20 విధానం వల్ల ప్రయోజనాలు ఉన్నప్పటికీ, దీనికి అనుగుణంగా వ్యవసాయ పద్ధతుల్లో మార్పులు తీసుకురావాలని మండ్యలోని వ్యవసాయ విజ్ఞాన విశ్వవిద్యాలయ విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ కేవీ కేశవయ్య తెలిపారు. సాధారణ నీటి పారుదల విధానాన్ని వీడి, బిందు సేద్యం వైపు దృష్టి సారించాలన్నారు. చెరకు, మక్కజొన్న, వరి లాంటి నీటిని అధికంగా కోరే పంటలను చాలా జాగ్రత్తగా నిర్వహించాల్సిన అవసరం ఉందని కేశవయ్య సూచించారు. భూగర్భ జలాలు ఇప్పటికే ఒత్తిడిలో ఉన్న ప్రాంతాల్లో నీటిని అధికంగా కోరే పంటలను సాగుచేయడానికి ఇథనాల్ విధానం అదనపు భారంగా మారనున్నదనడంలో సందేహం లేదు.

# శ్రీచైతన్య హాస్టల్‌లో నరరూప రాక్షసత్వం!

- పదో తరగతి విద్యార్థిపై ర్యాగింగ్ పేరిట తోటి విద్యార్థుల దాడి.. తీవ్ర గాయాలు
- కర్రలు, ప్లేట్లతో బాది బూట్లతో ముఖంపై తొక్కిన వైనం..
- మెట్లపై నుంచి పడ్డాడంటూ యాజమాన్యం డ్రామాలు

**వినోద్, ప్రజా తీర్పు, దమ్మాయిగూడ మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 10:-**

విద్యను నేర్పించాల్సిన విద్యాసంస్థల్లో భద్రత కొరవడి, హాస్టళ్లు విద్యార్థులకు నరకకూపాలుగా మారుతున్నాయనే దానికి నిదర్శనంగా దమ్మాయిగూడలోని శ్రీచైతన్య హైస్కూల్‌లో తీవ్ర దిగ్భ్రాంతికర సంఘటన వెలుగుచూసింది. పదో తరగతి చదువుతున్న అభిషేక్ అనే విద్యార్థిపై తోటి విద్యార్థులు గుంపుగా దాడి చేసి క్రూరంగా హింసించిన ఉదంతం తీవ్ర కలకలం రేపుతోంది. ? ?కామారెడ్డి జిల్లాకు చెందిన అభిషేక్ అనే విద్యార్థి దమ్మాయిగూడ శ్రీచైతన్య స్కూల్ హాస్టల్‌లో ఉంటూ పదో తరగతి చదువుతున్నాడు. రాత్రి సమయంలో హాస్టల్ గదిలో ఉన్న అభిషేక్‌పై దాదాపు 12 మంది తోటి విద్యార్థులు ఒక్కసారిగా దాడికి తెగబడ్డారు. ర్యాగింగ్ పేరుతో కర్రలు, ప్లేట్లతో దారుణంగా కొడుతూ, కాళ్లకు ఉన్న బూట్లతో ముఖంపై తొక్కుతూ రాక్షస ఆనందం పొందారు. బాధితుడు



కేకలు వేసినా కనీసం కనికరం చూపకుండా తీవ్రంగా గాయపరిచారు. ?'మెట్లపై నుంచి పడ్డాడు'.. యాజమాన్యం అబద్ధాల వేషాలు ?ఈ దారుణ దాడిలో తీవ్రంగా గాయపడిన అభిషేక్‌ను ఆసుపత్రికి తరలించిన యాజమాన్యం, ఘటనను కప్పిపుచ్చేందుకు నీచమైన యత్నాలకు పాల్పడింది. విద్యార్థి తల్లిదండ్రులకు ఫోన్ చేసి, "మీ అబ్బాయి మెట్లపై నుంచి కిందపడిపోయాడని" అబద్ధాలు చెప్పి బురిడీ కొట్టించే ప్రయత్నం చేసింది. అయితే ఆసుపత్రికి చేరుకున్న తల్లిదండ్రులు, బాధితుడి శరీరంపై ఉన్న దెబ్బలు, ముఖంపై ఉన్న బూట్ల గుర్తులను చూసి నిలదీయడంతో యాజమాన్యం బాధ్యతారాహిత్యం బట్టబయలైంది. ?లక్షల ఫీజులు.. శూన్యమైన భద్రత ?ఇంత పెద్ద ఎత్తున దాడి జరుగుతున్నా హాస్టల్ వార్డెన్, సెక్యూరిటీ సిబ్బంది కనీసం పట్టించుకోకపోవడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. ?పర్యవేక్షణ లోపం: హాస్టల్‌లో ఇంత మంది విద్యార్థులు గుమిగూడి దాడి చేస్తుంటే వార్డెన్ ఏం చేస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ?ఫీజుల దందా: తల్లిదండ్రుల నుంచి లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యం, విద్యార్థులకు కనీస రక్షణ కల్పించడంలో ఘోరంగా విఫలమైంది. ?నెటిజన్ల ఆగ్రహం: ఈ ఘటనకు సంబంధించిన వివరాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో నెటిజన్లు, విద్యార్థుల తల్లిదండ్రులు శ్రీచైతన్య యాజమాన్యంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నారు. ?తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలి మైనర్లు అనే సాకుతో ఇటువంటి హింసాత్మక ప్రవృత్తిని వదిలేస్తే భవిష్యత్తులో మరిన్ని ఘోరాలు జరిగే ప్రమాదం ఉంది. ఈ ఘటనపై విద్యాశాఖ, పోలీస్ యంత్రాంగం తక్షణమే సమగ్ర విచారణ జరిపి, తప్పును కప్పిపుచ్చడానికి యత్నించిన స్కూల్ యాజమాన్యంతో పాటు దాడికి పాల్పడిన విద్యార్థులపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు, బాధితుడి కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.



## జర్నలిస్టుల సమస్యలపై నిరంతరం పోరాడుతాం

### టిడబ్ల్యూజెయఫ్ కార్యదర్శి కొత్తకొండ సత్యం

**పటాన్ చేరు, ఆగస్టు 10 (ప్రజాతీర్పు)**

జర్నలిస్టుల సమస్యలపై యూనియన్లకు అతీతంగా నిరంతరం పోరాడతామని పటాన్ చెరు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ కార్యదర్శి కొత్తకొండ సత్యం అన్నారు. సోమవారం నాడు జిన్నారం మున్సిపల్ కేంద్రంలోపలువురు సీనియర్ జర్నలిస్టులు ఇటీవల పటాన్చెరు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ మూడో మహాసభలో కార్యదర్శిగా తిరిగి కొత్తకొండ సత్యం ఎన్నికైన సందర్భంగా వారికి శాలువాతో ఘనంగా సత్కరించి శుభకాంక్షలు చేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి సత్యం మాట్లాడుతూ మా యొక్క ఫెడరేషన్ సంఘంపై అభిమానంతో మమ్మల్ని సత్కరించిన జర్నలిస్టులకు పటాన్ చెరు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ డివిజన్ కమిటీ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శేఖర్ గౌడ్,మహేష్ గౌడ్,విజయ్, జింకల శ్రీనివాస్, మున్నీ శ్రీనివాస్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



## అలరించిన గోరింటోత్సవం...

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) ఆగస్టు 10.**

జగిత్యాల పట్టణంలోని వాణి నగర్ ఏరియాలో సోమవారం రమ్యనగేంద్ర ఇమిటేషన్ వారి ఆధ్వర్యంలో ఆడపడుచుల ఆషాఢం పండుగ సందర్భంగా "అరచేత గోరింటాకు" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ పాల్గొని మహిళలు, ఆడపడుచులతో కలిసి గోరింటాకు పెట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆషాఢ మాసంలో మహిళలు, ఆడపడుచులు కలిసి గోరింటాకు పెట్టుకోవడం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో ఒక ప్రత్యేకమైన ఆచారమని, ఇలాంటి కార్యక్రమాలు మహిళల్లో ఆత్మీయతను పెంపొందించడంతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు దోహదపడతాయని అన్నారు. కార్యక్రమంలో మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొని గోరింటాకు పెట్టుకుంటూ ఉత్సాహంగా సందడి చేశారు. వాణి నగర్ ప్రాంతంలో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమాన్ని నిర్వహించిన రమ్యనగేంద్ర ఇమిటేషన్ నిర్వాహకులను అడువాల జ్యోతి లక్ష్మణ్ అభినందించారు. ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న టౌన్ ఎస్ఐ సుప్రియ, ప్రముఖ స్త్రీ వైద్యనిపుణులు డాక్టర్ మోర రోజా, డాక్టర్ మృదుల రెడ్డి, శ్రీలత, నాగరత్న, మున్సిపల్ కో ఆప్షన్ వీరబత్తిని పద్మజ, మాజీ కౌన్సిలర్ మేక పద్మావతి మరియు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది.



## లయన్స్ ఐ హాస్పిటల్ చైర్మన్‌గా మీలా మహదేవ్ ఏకగ్రీవ ఎన్నిక

**(అనంతుల శ్రీనివాస్ గౌడ్ , ప్రజా తీర్పు సూర్యాపేట జిల్లా ప్రతినిధి) ఆగస్టు 10**

సూర్యాపేట లయన్స్ ఐ హాస్పిటల్ నూతన చైర్మన్‌గా ప్రముఖ పారిశ్రామికవేత్త, సుధాకర్ పీవీసీ మేనేజింగ్ డైరెక్టర్ మీలా మహదేవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం లయన్స్ ఐ హాస్పిటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన నూతన చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి గారు, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు భాస్కర్ గారు హాజరై నూతన కమిటీ సభ్యులకు శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా లయన్స్ ఐ హాస్పిటల్ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. కార్యదర్శిగా పెండెం చంద్రశేఖర్, కోశాధికారిగా చిలుముల శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా తోట శ్యామ్ ప్రసాద్, కక్కిరేణి చంద్రశేఖర్, పోలబోయిన నర్సయ్య, సంయుక్త కార్యదర్శిగా ఈగ దయాకర్ గుప్త ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా నూక వెంకటేశం గుప్తా, భోనగిరి భాస్కర్, చల్లా లక్ష్మీకాంత్, బెలిదె అంజయ్య, మిర్యాల సుధాకర్, కుమ్మరికుంట్ల లింగయ్య, ఆరె సురేష్ రెడ్డి, పటేల్ నర్సింహా రెడ్డి, రాచకొండ శ్రీనివాస్, ధర్మారావు ఎన్నికయ్యారు. గౌరవ సలహాదారులుగా గుణగంటి రాములు, మొరిశెట్టి లక్షాది, గుడిపూడి వెంకటేశ్వరరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## కొండెక్కుతున్న బంగారం.. మరో రూ 2 వేలు పెరిగిన ధర

బంగారం ధరలు మళ్లీ కొండెక్కుతున్నాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు తగ్గుముఖం పట్టడం, రూపాయి మరింత బలహీనపడుతుండటంతో అతి విలువైన లోహాల ధరలు దూసుకుపోతున్నాయి. దేశ రాజధాని న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల బంగారం ధర మరో రూ.2 వేలు ఎగబాకి రూ.1.56 లక్షలకు చేరుకున్నది. అంతకుముందు ఇది రూ.1.54 లక్షలుగా ఉన్నది. వరుసగా ఐదోరోజూ ధరలు పెరుగడం విశేషమని ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ వెల్లడించింది. అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధరలు స్థిరంగా ఉన్నప్పటికీ దేశీయంగా ధరలు మాత్రం పుంజుకోవడం విశేషమని ఎల్‌కేపీ సెక్యూరిటీస్ వైస్ ప్రెసిడెంట్ జతీన్ త్రివేది తెలిపారు. దీంతో ధరలు పుంజుకుంటున్న ప్రస్తుత తరుణంలో పెట్టుబడిదారులు వేచిచూసే ధోరణి అవలంబిస్తున్నారని పేర్కొన్నారు.



## బోగారంలో ఘనంగా 'హర్ ఘర్ తిరంగా'- ఇంటింటికీ జాతీయ జెండా ఎగురవేయాలి: సింగిరెడ్డి వెంకట్ రెడ్డి

**(వినోద్, ప్రజా తీర్పు,?బోగారం మేడ్చల్ జిల్లా) ఆగస్టు 10**

జిల్లా అధ్యక్షులు బుద్ది శ్రీనివాస్ ఆదేశాల మేరకు, హర్ ఘర్ తిరంగా జిల్లా కన్వీనర్ బోడ శ్రీనివాసరావు, కీసర డివిజన్ అధ్యక్షులు కోల బాల్ రాజ్ యాదవ్ సూచనలతో బోగారం గ్రామంలో 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని హర్ ఘర్ తిరంగా కన్వీనర్ అబ్రబోయిన జంగాలు ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా, స్థానికులు, నాయకులు కలిసి సామూహికంగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సింగిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. దేశభక్తిని చాటిచెప్పేలా ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను సగర్వంగా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాగుల అశోక్ ముదిరాజ్, కొలిచేలిమి కృష్ణ, నల్ల వెంకట్ రెడ్డి, అబ్రబోయిన నాగరాజు, పొట్ట ఆంజనేయులు, గోసుల శ్రీనివాస్, కోల మల్లేష్, బర్లపాటి ఆంజనేయులు, తాళ్ల మల్లేష్, నల్ల నారాయణ రెడ్డి, వీరాస్వామి, చీరాల మధు, దుర్గం వేణు, మహేందర్, బాలకృష్ణ రెడ్డి, గన్నేర్ల నిఖిల్ తేజ పాల్గొన్నారు.

## హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వడ్డీరేట్ల తగ్గింపు

దేశీయ ప్రైవేట్ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్..రుణ గ్రహీతలకు శుభవార్తను అందించింది. మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్-బేస్డ్ లెండింగ్ రేటు(ఎంసీఎల్ఆర్)ని 5 బేసిస్ పాయింట్లు తగ్గిస్తున్నట్టు ప్రకటించింది. ఎంపిక చేసిన రుణాలకు మాత్రమే ఈ తగ్గింపు వర్తించనున్నదని, దీంతో రుణ గ్రహీతలకు ఆర్థిక ప్రయోజనాలు కలుగనున్నట్టు పేర్కొంది. బ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయంతో ఒక్క రోజు, నెల రుణాలపై వడ్డీరేటు 8.05 శాతం నుంచి 8 శాతానికి దిగిరాగా, మూడు నెలల రుణాలపై రేటు 8.20 శాతం నుంచి 8.15 శాతానికి తగ్గగా, ఆరు నెలల రుణాలపై రేటు 8.35 శాతం నుంచి 8.30 శాతానికి, ఏడాది రుణాలపై రేటు 8.45 శాతం నుంచి 8.40 శాతానికి తగ్గించినట్టు వెల్లడించింది.




## అమర రాజా లాభం 191 కోట్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 10: ప్రముఖ బ్యాటరీల తయారీ సంస్థ అమర రాజా బ్యాటరీస్ ప్రోత్సాహకర ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. జూన్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.190.94 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ఆర్జించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.164.8 కోట్ల లాభంతో పోలిస్తే 16 శాతం వృద్ధిని కనబరిచింది. సమీక్షాకాలంలో కంపెనీ రూ.4,214.54 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయాన్ని ఆర్జించింది. 2025-26 ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో సంస్థ రూ.3,401.08 కోట్ల ఆదాయాన్ని గడించినట్టు బీఎస్ఈకి సమాచారం అందించింది. ఏడాది క్రితం రూ.3,190.66 కోట్ల స్థాయి లో ఉన్న కంపెనీ నిర్వహణ ఖర్చులు ఈసారికిగాను రూ.3,979.41 కోట్లకు పెరిగాయి. సంస్థకు వచ్చిన ఆదాయంలో యాసిడ్ బ్యాటరీలు, అనుబంధ ప్రొడక్ట్‌ల విభాగాల నుంచి రూ.4,005.24 కోట్ల ఆదాయం సమకూరగా, న్యూ ఎనర్జీ విభాగం నుంచి రూ.209.30 కోట్ల ఆదాయం లభించింది.

## వొడాఫోన్ ఐడియా నష్టం 3,754 కోట్లు

అప్పుల ఊబిలో కొట్టుమిట్టాడుతున్న టెలికాం సంస్థ వొడాఫోన్ ఐడియా నష్టాల పరంపర కొనసాగుతున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికిగాను సంస్థ రూ.3,754 కోట్ల నష్టాన్ని నమోదు చేసుకున్నది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో సంస్థ రూ.6,611 కోట్ల నష్టాన్ని ప్రకటించింది.గత త్రైమాసికంలో ఫైనాన్స్ చెల్లింపులకోసం రూ.5,120 కోట్ల నిధులు వెచ్చించింది. సమీక్షాకాలంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 6 శాతం ఎగబాకి రూ.11,689 కోట్లకు చేరుకున్నట్టు బీఎస్ఈకి సమాచారం అందించింది. ప్రస్తుతం సంస్థకు 19.31 కోట్ల మంది వినియోగదారులు ఉన్నారు.

## స్టోన్ క్రషర్ నిర్వాహకుడి వద్ద రూ.20 లక్షలు , రైస్ మిల్ నిర్వాహకుడి వద్ద రూ.10 లక్షలు డిమాండ్ చేసిన ఇద్దరు అరెస్ట్, రిమాండ్.

- నిందుతుల వద్ద రూ.50,000/- నగదు,రెండు. మొబైల్ ఫోన్స్ స్వాధీనం.
- బెదిరింపులు, అక్రమ వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు.
- వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే.

**(నారుకట్ల మధు ప్రజా తీర్పు రాజన్న సిరిసిల్ల జిల్లా) ఆగస్టు 10**

దండు వినోద్ కుమార్, పెద్దగారి అమరగొండ అజయ్ అనే ఇద్దరు వ్యక్తులు కలిసి వ్యాపారం నిర్వహించే వ్యక్తులను లక్ష్యంగా చేసుకొని వారిని బెదిరించి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేయాలని నిర్ణయించుకున్నారు. అపథకంలో భాగంగా వేములవాడ పట్టణ పరిధిలోని అగ్రహారం గ్రామ శివారులో స్టోన్ క్రషర్ నిర్వహిస్తున్న నీలం గురవయ్యను నిందితులు లక్ష్యంగా చేసుకొని ఈ నెల 9 వ తేదీన దండు వినోద్ తన మొబైల్ ఫోన్ నంబర్ నుండి నీలం గురవయ్యకు ఫోన్ చేసి, క్రషర్‌కు సంబంధించిన లైసెన్స్, భూమికి సంబంధించిన విషయాలపై అసత్య ప్రచారం చేస్తామని ఫోన్ ద్వారా బెదిరించగా, గురవయ్య అగ్రహారం ప్రాంతానికి రాగా, నిందితులు ఇద్దరూ అతడిని అగ్రహారం గుట్టల వద్దకు తీసుకెళ్లి, అతని క్రషర్ మరియు వ్యాపారానికి సంబంధించి అసత్య ప్రచారాలు చేయకుండా ఉండాలంటే రూ.20,00,000/- ఇవ్వాలని ఇవ్వకపోతే వ్యాపారాన్ని దెబ్బ తీస్తానని బెదిరించగా,దీంతో భయపడిన బాధితుడు ూవీకు వెళ్లి రూ.50,000/- నగదు తీసుకుని వచ్చి వేములవాడలోని అగ్రహారం టీ పాయింట్ వద్ద నిందితులకు ఇవ్వడం జరిగింది. మరియు వేములవాడ కి చెందిన బండ మల్లేశం అను రైస్ మిల్లర్ ను కూడా బెదిరింపులకు పాల్పడి రూ. 10,00,000/- డిమాండ్ చేయగా బాధితుల ఫిర్యాదు మేరకు వేములవాడ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా నిందుతులని నిన్నటి రోజు రాత్రి సాయినగర్ లో అదుపులోకి తీసుకొని వారి వద్ద 50,000/- రూపాయల నగదు, రెండు మొబైల్ ఫోన్స్ స్వాధీనం చేసుకొని ఈరోజు రిమాండ్ కి తరలించడం జరిగిందన్నారు.

**ప్రజలకు విజ్ఞప్తి.**



ఎవరైనా వ్యక్తులు బెదిరింపులకు పాల్పడి డబ్బులు డిమాండ్ చేసినట్లయితే ప్రజలు భయపడకుండా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలి లేదా 112 నంబర్‌కు డయల్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని , వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు, ప్రజలు ఎలాంటి బెదిరింపులకు, ఒత్తిళ్లకు లొంగకుండా ధైర్యంగా పోలీసులను ఆశ్రయించాలని కోరారు. బెదిరింపులకు పాల్పడటం, అసత్య ప్రచారాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం, అక్రమంగా డబ్బులు వసూలు చేయడం వంటి చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఈసందర్భంగా ఎస్పీ గారు హెచ్చరించారు. నిందుతుల వద్ద రూ.50,000/- నగదు,రెండు. మొబైల్ ఫోన్స్ స్వాధీనం. బెదిరింపులు, అక్రమ వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు.

**వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే.**

**నిందితుల వివరాలు:**

1. దండు వినోద్, తండ్రి ఐలయ్య, వయస్సు 33 సంవత్సరాలు,నివాసం: ఏగలాస్పూర్ గ్రామం,కొనరావుపేట మండలం, ప్రస్తుతం సాయి నగర్, వేములవాడ పట్టణం.
2. పెద్దిగారి అమరగొండ అజయ్, తండ్రి నాగమల్లయ్య, వయస్సు 27 సంవత్సరాలు, నివాసం:నాంపల్లి, వేములవాడ పట్టణం. ఈసందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ.....దండు వినోద్ కుమార్, పెద్దగారి అమరగొండ అజయ్ అనే ఇద్దరు వ్యక్తులు కలిసి

వ్యాపారం నిర్వహించే వ్యక్తులను లక్ష్యంగా చేసుకొని వారిని బెదిరించి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేయాలని నిర్ణయించుకున్నారు. అపథకంలో భాగంగా వేములవాడ పట్టణ పరిధిలోని అగ్రహారం గ్రామ శివారులో స్టోన్ క్రషర్ నిర్వహిస్తున్న నీలం గురవయ్యను నిందితులు లక్ష్యంగా చేసుకొని ఈ నెల 9 వ తేదీన దండు వినోద్ తన మొబైల్ ఫోన్ నంబర్ నుండి నీలం గురవయ్యకు ఫోన్ చేసి, క్రషర్‌కు సంబంధించిన లైసెన్స్, భూమికి సంబంధించిన విషయాలపై అసత్య ప్రచారం చేస్తామని ఫోన్ ద్వారా బెదిరించగా, గురవయ్య అగ్రహారం ప్రాంతానికి రాగా, నిందితులు ఇద్దరూ అతడిని అగ్రహారం గుట్టల వద్దకు తీసుకెళ్లి, అతని క్రషర్ మరియు వ్యాపారానికి సంబంధించి అసత్య ప్రచారాలు చేయకుండా ఉండాలంటే రూ.20,00,000/- ఇవ్వాలని ఇవ్వకపోతే వ్యాపారాన్ని దెబ్బ తీస్తానని బెదిరించగా,దీంతో భయపడిన బాధితుడు ూవీకు వెళ్లి రూ.50,000/- నగదు తీసుకుని వచ్చి వేములవాడలోని అగ్రహారం టీ పాయింట్ వద్ద నిందితులకు ఇవ్వడం జరిగింది. మరియు వేములవాడ కి చెందిన బండ మల్లేశం అను రైస్ మిల్లర్ ను కూడా బెదిరింపులకు పాల్పడి రూ. 10,00,000/- డిమాండ్ చేయగా బాధితుల ఫిర్యాదు మేరకు వేములవాడ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా నిందుతులని నిన్నటి రోజు రాత్రి సాయినగర్ లో అదుపులోకి తీసుకొని వారి వద్ద 50,000/- రూపాయల నగదు, రెండు మొబైల్ ఫోన్స్ స్వాధీనం చేసుకొని ఈరోజు రిమాండ్ కి తరలించడం జరిగిందన్నారు.

ప్రజలకు విజ్ఞప్తి.

ఎవరైనా వ్యక్తులు బెదిరింపులకు పాల్పడి డబ్బులు డిమాండ్ చేసినట్లయితే ప్రజలు భయపడకుండా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలి లేదా 112 నంబర్‌కు డయల్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని , వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు, ప్రజలు ఎలాంటి బెదిరింపులకు, ఒత్తిళ్లకు లొంగకుండా ధైర్యంగా పోలీసులను ఆశ్రయించాలని కోరారు. బెదిరింపులకు పాల్పడటం, అసత్య ప్రచారాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం, అక్రమంగా డబ్బులు వసూలు చేయడం వంటి చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఈసందర్భంగా ఎస్పీ గారు హెచ్చరించారు.



# ఫిట్ సర్ఫూ.. హిట్ అవుతాడా?

ముంబై నుంచి ఎంతో మంది ప్రతిభావంతులైన క్రికెటర్లు భారత జట్టులోకి వచ్చారు. ఇప్పటికీ వస్తూనే ఉన్నారు. వారిలో సర్ఫరాజ్ ఖాన్ఎంతో ప్రత్యేకం. టన్నుల కొద్దీ టాలెంట్ ఉన్న సర్ఫూ దేశవాళీ క్రికెట్‌లో ఎన్నో సీజన్ల పాటు పరుగుల మోత మోగించి.. చాలా ఏండ్ల ఎదురుచూపుల తర్వాత 2024లో టెస్టు అరంగేట్రం చేశాడు. తొలి టెస్టులోనే రెండు అర్ధ శతకాలు.. నాలుగో మ్యాచ్‌లోనే అద్భుత శతకంతో తన రాకను ఘనంగా చాటుకున్నాడు. కానీ, అంతే వేగంగా జట్టుకు దూరమైన సర్ఫరాజ్ 19 నెలల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత మళ్లీ జాతీయ జట్టులోకి వచ్చాడు. శ్రీలంకతో ఈ నెల 15 నుంచి గాలే వేదికగా మొదలయ్యే రెండు టెస్టుల సిరీస్ కోసం భారత జట్టులో చోటు దక్కించుకున్నాడు. కాలి బొటనవేలి గాయంతో సిరీస్ మొత్తానికి దూరమైన సాయి సుదర్శన్ స్థానంలో సెలెక్షన్ కమిటీ సర్ఫరాజ్‌ను ఎంపిక చేసింది. దాంతో 2024 నవంబర్‌లో న్యూజిలాండ్‌తో తన ఆరో టెస్టు ఆడిన సర్ఫరాజ్..మళ్లీ జాతీయ జట్టులోకి పునరాగమనం చేశాడు. 'నేను జట్టులో ఇమడకపోవచ్చు.. కానీ నా శక్తిమేరకు పోరాడుతా 'అని కొన్ని రోజుల క్రితమే సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన సర్ఫరాజ్, అనుకున్నది సాధించి చూపించాడు. అయితే, గత 19 నెలల కాలం సర్ఫరాజ్ కెరీర్, జీవితం ఎన్నో మలుపులు తిరిగింది.

### అందరూ ఫెయిల్.. బలైంది ఒక్కడే

నిజానికి సొంతగడ్డపై న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్ భారత్‌కు ఓ చేదు జ్ఞాపకం. రోహిత్ శర్మ కెప్టెన్సీలోని నాటి జట్టు మూడు టెస్టుల్లోనూ ఓడి 0–3తో వైట్‌వాష్ అయి విమర్శలపాలైంది. నాడు జట్టులోని మిగతా ఆటగాళ్లూ ఫెయిలైనా.. బలైంది 28 ఏండ్ల సర్ఫరాజ్ మాత్రమే. ఆస్ట్రేలియాలో బోర్డర్–గావస్కర్ ట్రోఫీలో జట్టులో ఉన్నా.. తనకు బరిలోకి దిగే చాన్స్ ఇవ్వలేదు.

# విండీస్ మూడోసారి.. వన్డే వరల్డ్‌కప్‌లో ఆటోమేటిక్ క్వాలిఫికేషన్ ఆశలు ఆవిరి




వరుసగా రెండు వన్డే ప్రపంచకప్‌లు గెలిచిన వెస్టిండీస్‌కు మరోసారి ఝలక్. వచ్చే ఏడాది దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా ఆతిథ్యమివ్వబోయే వన్డే ప్రపంచకప్‌నకు నేరుగా అర్హత సాధించే అవకాశాన్ని ఆ జట్టు కోల్పోయింది. ఐర్లాండ్, అఫ్గానిస్థాన్ మధ్య జరుగుతున్న వన్డే సిరీస్‌లో భాగంగా అఫ్గాన్.. రెండో వన్డేలో గెలవడంతో విండీస్ ఆశలు అడియాసలయ్యాయి. వాస్తవానికి ఈ సిరీస్‌ను ఐర్లాండ్ 5–0 లేదా 4–1తో గెలిచి తర్వాత వెస్టిండీస్.. భారత్‌తో వన్డే సిరీస్‌ను 2–0తో నెగ్గితేనే కరీబియన్లకు ప్రపంచకప్‌లో డైరెక్ట్ క్వాలిఫికేషన్ దక్కేది. కానీ తొలి వన్డే వర్షార్పణమవగా రెండో వన్డేలో అఫ్గాన్ నెగ్గడంతో వెస్టిండీస్ కథ ముగిసినట్టైంది. వరల్డ్‌కప్‌లో ర్యాంకింగ్‌ల ఆధారంగా జట్లు టోర్నీకి అర్హత సాధిస్తాయన్న విషయం విదితమే. ర్యాంకింగ్స్‌లో టాప్–8న ఉండే జట్లు నేరుగా వరల్డ్ కప్ ఆడాల్సి ఉండగా మిగతా జట్లు క్వాలిఫికేషన్ రౌండ్ ఆడి ప్రధాన టోర్నీకి అర్హత సాధించాల్సి ఉంటుంది. కాగా క్వాలిఫికేషన్ రౌండ్ ఆడటం వెస్టిండీస్‌కు ఇది వరుసగా మూడోసారి కావడం గమనార్హం.

# బోదన, శ్రేయస్ అదరహో.. బ్రిటీష్ చెస్ చాంపియన్‌షిప్స్‌లో టైటిళ్లు కైవసం

పసివయసులోనే 64 గళ్ల ఆటపై మక్కువ పెంచుకుని ఆటలో అద్భుతాలు సృష్టిస్తున్న బోదన శివానందన్, శ్రేయస్ రాయల్ బ్రిటన్ గడ్డపై సత్తాచాటారు. 122 ఏండ్ల చరిత్ర కలిగిన ప్రతిష్టాత్మక బ్రిటీష్ చెస్ చాంపియన్‌షిప్స్‌లో భారత సంతతికి చెందిన ఈ ఇద్దరు చెస్ ప్లేయర్లూ.. తమ విభాగాల్లో టైటిళ్లు గెలిచి ఔరా అనిపించారు. సుమారు 1,750 మంది ప్లేయర్లు పాల్గొన్న ఈ టోర్నీలో 11 ఏండ్ల బోదన.. మహిళల విభాగంలో చాంపియన్‌గా నిలువగా ఓపెన్ కేటగిరీలో17 ఏండ్ల శ్రేయస్ విజయం సాధించాడు. ఆదివారం ఉత్కంఠగా జరిగిన ర్యాపిడ్ చెస్ ప్లేఆఫ్స్‌లో బోదన.. ఐర్లాండ్‌కు చెందిన 14 ఏండ్ల త్రిషా కన్యమరలను ఓడించి టైటిల్‌ను సొంతం చేసుకుంది. దీంతో ఆ చిన్నారి బ్రిటన్ యంగెస్ట్ ఉమెన్స్ చెస్ చాంపియన్‌గా సరికొత్త రికార్డులు సృష్టించింది. నార్త్ వెస్ట్ లండన్‌లో నివసిస్తున్న బోదన.. కోవిడ్ సమయంలో చెస్



నేర్చుకుంది. ఇప్పటికే యూకే ఓపెన్ ఉమెన్స్ బ్లిట్జ్ చాంపియన్ గెలవడంతో పాటు బ్రిటీష్ ఉమెన్స్ ర్యాపిడ్ విజేతగా నిలిచి సత్తాచాటింది. తాజాగా క్లాసికల్ ఫార్మాట్‌లోనూ ఆమె టైటిల్ గెలవడం గమనార్హం.



# సెపక్‌తక్రాలో భారత్‌కు కాంస్యం

భారత సెపక్‌తక్రా జట్టు ప్రతిష్టాత్మక వరల్డ్ చాంపియన్‌షిప్స్ (కింగ్స్ కప్)లో కాంస్యం సాధించింది. బ్యాంకాక్‌లో జరిగిన 39వ ఎడిషన్‌లో టోర్నీ క్వాడ్రంట్ ఈవెంట్‌లో భాగంగా హోరాహోరీగా సాగిన సెమీస్‌లో భారత్.. 1–2 (15–9, 9–15, 9–15) తేడాతో థాయ్‌లాండ్ చేతిలో ఓడి కాంస్యంతో సరిపెట్టుకుంది. త్వరలో జరుగబోయే ఆసియా క్రీడల్లో ఈ గేమ్ కూడా ఉన్నందున భారత్‌కు ఈ విజయం ఉత్సాహాన్నిచ్చేదే. ఈ టోర్నీ గ్రూప్ దశలో భారత్.. శ్రీలంక, వియత్నాం, పాకిస్థాన్, ఇరాక్‌ను ఓడించి సెమీస్‌కు చేరుకుంది. వాలీబాల్‌ను పోలి ఉండే ఈ ఆటలో సాధారణంగా ముగ్గురు ప్లేయర్లు ఆడతారు. చేతులను ఉపయోగించకుండా తల, చాతి, కాళ్లతో బంతిని ఆడాల్సి ఉంటుంది. కానీ, క్వాడ్రంట్ విభాగంలో నలుగురు ఆటగాళ్లు పోటీ పడతారు.





# మహిళల రిలే జట్టుకు నిరాశ

యూజీన్ (యూఎస్ఏ): వరల్డ్ అథ్లెటిక్స్ అండర్–20 చాంపియన్‌షిప్స్‌లో భారత మహిళళ 4x400 మీటర్ల రిలే జట్టుకు నిరాశ ఎదురైంది. ఫైనల్స్‌కు క్వాలిఫై అయిన భూమిక, తాహుర, తనూ చౌదరి, థియా అరుముగమ్ బృందం.. రేసును 3 నిమిషాల 45.28 సెకన్లలో పూర్తిచేసి ఏడో స్థానంలో నిలిచింది. ఈ పోటీలో యూఎస్ఏకు స్వర్ణం, ఆస్ట్రేలియాకు రజతం, బ్రిటన్‌కు కాంస్యం దక్కాయి. మహిళల హైజంప్‌లో పతకంపై ఆశలు రేపిన భారత పూజ సైతం నిరాశపరిచింది.ఫైనల్‌లో ఆమె 1.84 మీటర్లే దూకగా ఆస్ట్రేలియా (1.92 మీ.), హంగేరి (1.90 మీ.), స్పెయిన్ (1.90 మీ.) అథ్లెట్లు టాప్–3లో నిలిచి పతకాలు గెలిచారు. 2022 ఎడిషన్ తర్వాత ఈ టోర్నీని భారత్ మూడు పతకాల (2 రజతాలు, ఒక కాంస్యం)తో ముగించింది.



# హీరోయిన్‌గా కలిసిరాని అదృష్టం.. తలైన తగ్గదే లే అంటున్న వయ్యారి భామ..

ఎంతో మంది అందాల భామలు కొన్ని సినిమాలేక పరిమితం అవుతున్నారు. అందం, అభినయం ఉన్నప్పటికీ కొంతమంది భామలు నాలుగు ఐదు సినిమాలు చేసి ఆతర్వాత కనిపించకుండా పోతున్నారు. ఇప్పటికే చాలా మంది హీరోయిన్స్ సినిమాలు మానేసి పెళ్లి చేసుకొని సెటిల్ అవుతున్నారు. దాంతో అభిమానులు ఈ ముద్దుగుమ్మల కోసం సోషల్ మీడియాలో గాలిస్తున్నారు. ఇప్పుడు ఓ చిన్నదాని కోసం నెటిజన్స్ గూగుల్ లో తెగ గాలిస్తున్నారు. ఇంతకూ ఆ భామ ఎవరో తెలుసా.? తెలుగులో ఈ బ్యూటీ చేసింది ఎనిమిది సినిమాలు కానీ హిట్ అయ్యింది మాత్రం ఒకే ఒక్క సినిమా. అందంలో ఈ అమ్మడు అప్సరస.. కెరీర్ పీక్ లో ఉండగానే సినిమాలకు దూరం అయ్యింది. పెళ్లి చేసుకొని కొత్త లైఫ్ లీడ్ చేస్తుంది. ఇంతకూ ఆమె ఎవరో తెలుసా.? అందం, అభినయం ఉన్నా కూడా సక్సెస్ సాధించలేకపోయింది ఈ బ్యూటీ. హీరోయిన్ గా చేసింది, సెకండ్ హీరోయిన్ గాను చేసింది అయినా కూడా ఆమెకు అనుకున్నంతగా గుర్తింపు రాలేదు. ఇంతకూ ఆమె ఎవరో కాదు టాలీవుడ్ బాపు బొమ్మ ప్రణీత సుభాష్. తన క్యూట్ లుక్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకున్న ప్రణీత సుభాష్ కు మంచి క్రేజ్ సొంతం చేసుకుంది. ఈ అమ్మడి అందానికి కుర్రకారు ఫిదా అయ్యారు. ఏం పిల్లో ఏం పిల్లడో సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయ్యింది ఈ అమ్మడు. హీరోయిన్ గా వరుసగా సినిమాలు చేసి మెప్పించింది. హీరోయిన్ గా అనుకున్నంత గుర్తింపు సొంతం చేసుకోలేదు. ఆతర్వాత సెకండ్ హీరోయిన్ గా సినిమాలు చేసింది. అయినా కూడా అంతగా సక్సెస్ సాధించలేదు. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన అత్తారింటికి దారేది సినిమాతో భారీ హిట్ అందుకుంది.



# మెగా ఆఫర్ కొట్టేసిందట?

గత ఏడాది సంక్రాంతికి 'సంక్రాంతికి వస్తున్నాం'.. ఈ ఏడాది సంక్రాంతికి 'అనగనగా ఒక రాజు'.. ఇలా వరుస సంక్రాంతి విజయాలతో పండుగ హీరోయిన్‌గా పేరు గాంచింది హర్యానా అందం మీనాక్షి చౌదరి. ప్రస్తుతం నాగచైతన్యతో 'వృషకర్మ' చిత్రంలో నటిస్తూ బిజీగా ఉన్నది ఈ అందాలభామ. ఇదిలావుంటే.. ఓ అపూర్వమైన అవకాశం మీనాక్షి చౌదరి తలుపు తట్టినట్టు ఫిల్మ్ వర్గాల్లో ఓ వార్త బలంగా వినిపిస్తున్నది. మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా కేఎస్ రవీంద్ర(బాబీ) దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'మెగా 158'(వర్కింగ్ టైటిల్) చిత్రంలో మీనాక్షి చౌదరి నటించనున్నదట.

అయితే.. ఆమెది హీరోయిన్ పాత్ర కాదని, ఓ అతిథి పాత్రలో ఆమె కనిపిస్తుందని తెలుస్తున్నది. ఈ సినిమా ఫ్లాష్‌బ్యాక్‌లో ఆమె పాత్ర ఉంటుందట. మరో ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. ఫ్లాష్‌బ్యాక్‌లో వచ్చే మెగాస్టార్ పాత్రలో చాలా వేరియేషన్స్ ఉంటాయని, మాఫియా నేపథ్యంలో ఆయన పాత్ర సాగుతుందని వినికిడి. యాక్షన్, ఫ్యామిలీ ఎమోషన్స్ ప్రధానంగా సాగే ఈ సినిమాను కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె.నారాయణ, లోహిత్ నిర్మిస్తున్న విషయం తెలిసిందే.



# అజిత్ సినిమాలో అతిథి పాత్ర?

తమిళ అగ్ర నటుడు అజిత్‌కుమార్ తాజా చిత్రం 'డేర్‌డేవిల్' సెప్టెంబర్‌లో సెట్స్‌మీదకు వెళ్లనుంది. అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను భారీ కమర్షియల్ హంగులతో తెరకెక్కించబోతున్నారు. షాలిని అజిత్ కుమార్ ఈ చిత్రానికి నిర్మాత. ఈ పాన్ ఇండియా సినిమాలో కీలకమైన అతిథి పాత్ర కోసం చిత్రబృందం అగ్ర నటుడు వెంకటేష్‌ను సంప్రదించినట్లు వార్తలొస్తున్నాయి. కథాగమనంలో ఈ గెస్ట్‌రోల్ చాలా కీలకంగా ఉంటుందని, స్క్రీన్‌స్పేస్ కూడా చాలా ఎక్కువేనని చెబుతున్నారు. ఈ సినిమాలో వెంకటేష్ అతిథి పాత్రలో నటించడం దాదాపు ఖాయమైందని తమిళ సినీవర్గాల్లో వినిపిస్తున్నది. అయితే ఈ వార్తల్లో నిజమెంతో తెలియాలంటే మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే.

Edited Printed Published and Owned by SOYINENI MAHESH, **RNI Reg no. APTEL/2001/5268** printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020